

# భారత్ ఖేల్ ఖతం

పురుషుల హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు మళ్లీ నిరాశే. మెగా టోర్నీలో ఐదు దశాబ్దాల తర్వాత చాంపియన్‌గా నిలవాలని ఆశించిన జట్టు పోరాటం సెమీఫైనల్ చేరకుండానే ముగిసింది. శనివారం కచ్చితంగా నెగ్గాల్సిన రెండో రౌండ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్సీలోని టీమిండియా 1-3తో ఒలింపిక్ చాంప్ నెదర్లాండ్స్ చేతిలో పరాజయం పాలైంది. ఆఖరి 10 నిమిషాల్లో చేసిన పొరపాట్లు మన జట్టును దెబ్బతీశాయి. తొలి రెండు క్వార్టర్స్‌లో డిఫెండర్లు డచ్ దాడిని సమర్థవంతంగా అడ్డుకోవడంతో ఫస్టాఫ్ 0-0తో ముగించింది. కానీ, ద్వితీయార్థంలో డచ్ టీమ్ వరుస ఫీల్డ్ గోల్స్‌తో విరుచుకుపడింది. 41వ నిమిషంలో టెల్గెన్‌క్యాంప్, 51వ నిమిషంలో హుడెమేకర్స్ చెరో గోల్ కొట్టగా.. తర్వాతి నిమిషంలోనే లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్ చేసి భారత శిబిరంలో ఆశలు రేపాడు. కానీ, 55వ నిమిషంలో థిజ్స్ వాన్ డామ్ సునాయాస గోల్ కొట్టి నెదర్లాండ్స్ విజయాన్ని ఖాయం చేశాడు.


# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
ఆదివారం
23.08.2026

సంపుటి : 16 సంచిక: 327
పేజీలు: 7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


## జీవో 97 రద్దయ్యే వరకు విద్యార్థుల వెంటే ఉంటాం



- పాలిటెక్నిక్ వ్యవస్థను ఐటీఐల్లో కలపడం డీగ్రేడ్ చేయడమే
- రాహుల్ గాంధీ తెలంగాణ విద్యార్థుల సమస్యపై ఎందుకు మౌనం వహిస్తున్నారు?
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ఐటీఐలతో అనుసంధానం చేసే జీవో 97ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. జీవో రద్దయ్యే వరకు పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ సంపూర్ణ మద్దతుగా నిలుస్తాయని ప్రకటించారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు హరీశ్ రావును కలిసి తమ సమస్యలను వివరించారు. జీవో 97 అమలుతో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందని, తమ భవిష్యత్తుపై ఆందోళన నెలకొందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో కలపడం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందన్నారు. విద్యాశాఖలో స్కూల్ ఎడ్యుకేషన్, హయ్యర్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగాలు ఉన్నాయని, టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ వ్యవస్థను ఐటీఐలతో కలపడం విద్యా వ్యవస్థను డీగ్రేడ్ చేయడమేనని అభిప్రాయపడ్డారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్ ద్వారా నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉందని గుర్తుచేశారు. ఈ విధానం వల్ల విద్యార్థులకు విద్యా సంవత్సరం వృథా కాకుండా ఉన్నత విద్యకు వెళ్లే అవకాశం లభిస్తోందన్నారు. తాను కూడా మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా చదివిన పూర్వ విద్యార్థినేనని పేర్కొన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో 400 మందికి పైగా కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసినట్లు చెప్పారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై మంత్రి వివేక్ చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తప్పుబట్టారు. ప్రభుత్వం కొనసాగుతుందో లేదో హామీ ఇవ్వలేనన్న తరహాలో మంత్రి మాట్లాడటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇవ్వాల్సిన మంత్రి తప్పించుకునేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఢిల్లీలో విద్యార్థులకు అన్యాయం జరిగితే స్పందించే రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న ఆందోళనలపై కూడా స్పందించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి జీవో 97ను రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థిపై పోలీసు అధికారి దురుసుగా వ్యవహరించారని ఆరోపించిన హరీశ్ రావు, ఆ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దకోడూరు, రాజగోపాల్‌పేట ప్రాంతాల్లో జీవో 97కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు ఇప్పటికే మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. నంగునూరు పర్యటన సమయంలో కూడా విద్యార్థులు, లెక్చరర్లు వినతిపత్రాలు అందజేశారని చెప్పారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై స్వయంగా లేఖ రాస్తానని హరీశ్ రావు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జీవో 97 అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు అధైర్యపడవద్దని సూచించిన హరీశ్ రావు, జీవో 97 రద్దయ్యే వరకు పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు.

# గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం

- శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు కార్మికుల మృతి
- 50 గజాల స్థలంలో భారీ నిర్మాణం
- నాలా ఆక్రమణపై హైడ్రా ఆగ్రహం
- నాలుగు నెలల క్రితమే యజమానికి నోటీసులు
- బిల్డర్ సాజిద్‌పై కేసు.. కొనసాగుతున్న గాలింపు
- అక్రమ నిర్మాణాలపై హైడ్రా వార్నింగ్



**చట్టం, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ప్లంబింగ్ పనులు చేస్తున్న ఇద్దరు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. భారీ శిథిలాలను తొలగిస్తూ ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కొద్దిసేపటి తరువాత ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేశ్ కారె, మోపత్‌గా పోలీసులు గుర్తించారు. వీరు కొండాపూర్‌లో నివసిస్తూ నిర్మాణ పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 50 గజాల స్థలంలో ఏడంతస్తులు నిర్మించడంతో స్థానికులు గతంలోనే ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఘటనతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఘటన అనంతరం ప్రాంతంలో రాకపోకలను నియంత్రించి ప్రజలను దూరంగా ఉంచారు సహాయక బృందాలు అప్రమత్తంగా పనిచేశాయి తక్షణమే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కూలిన భవనం శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్‌మెంట్ గోడలు దెబ్బతిన్నాయి. సమీప హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ప్రమాదం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జరిగినట్లు స్థానికులు తెలిపారు. పెద్ద శబ్దం వినిపించడంతో బయటకు వచ్చి చూడగా భవనం నేలమట్టమై కనిపించిందని చెప్పారు. శిథిలాల తొలగింపు సమయంలో ప్రమాదకరంగా వేలాడుతున్న స్లాబ్ మరింత ముప్పు కలిగించే పరిస్థితి కనిపించింది. ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది జాగ్రత్తగా శిథిలాలను తొలగించారు. ఘటనాస్థలాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాయంత్రం వేళ ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలా పక్కన కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల నిర్మాణం చేపట్టారని, సెట్‌బ్యాక్‌లు లేకుండా అంతస్తులు పెంచారని చెబుతున్నారు. భవనం పైన పెంట్‌హౌస్ నిర్మాణ పనులు కూడా సాగుతున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి నిర్మాణాలు చాలానే ఉన్నాయని, వాటిలో అనేక భవనాలకు అవసరమైన ఖాళీ స్థలం లేదని తెలిపారు. నాలా ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి తొలగిస్తామని స్పష్టం చేశారు. హాస్టళ్లుగా వినియోగిస్తున్న భవనాల భద్రతను కూడా పరిశీలిస్తామని చెప్పారు. బిల్డర్ సాజిద్ నిర్మించిన ఇతర భవనాలపై కూడా తనిఖీలు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని రంగనాథ్ వెల్లడించారు. యజమానులు వెంటనే భవనాలను ఖాళీ చేయాలని సూచించారు. దీంతో పరిసరాల్లో చర్చ మొదలైంది. భవనాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సీఎంసీ కమిషనర్ సృజన కీలక వివరాలు వెల్లడించారు. నాలుగు నెలల క్రితమే భవన యజమానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. భవనాన్ని సీజ్ చేసినా ఇటీవల పనులు తిరిగి ప్రారంభించినట్లు గుర్తించామని చెప్పారు. అధికారిక చర్యలు పూర్తయ్యేలోపే నిర్మాణం కూలిపోయిందని వివరించారు. అనుమతులు, నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయి పరిశీలన జరుగుతుందని తెలిపారు. మరోవైపు భవన యజమాని సాజిద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. ప్రమాదానికి అసలు కారణాలను సాంకేతిక నిపుణుల సహకారంతో గుర్తించనున్నారు. నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నాయా, అనుమతులకు మించి అంతస్తులు నిర్మించారా, నాలా పరిధిని ఆక్రమించారా వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అంజయ్యనగర్‌లో భవనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించడంతో అక్రమ నిర్మాణాలపై చర్యలు వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను గుర్తించి కూల్చివేస్తామని ఆయన స్పష్టం చేశారు. నాలా ఆక్రమణలు, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు, అనుమతులేని అంతస్తులు, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని తెలిపారు. ఘటనలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో నిర్మాణ రంగంలో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. చిన్న స్థలాల్లో భారీ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా వచ్చాయన్న అంశం కూడా చర్చకు వచ్చింది. ప్రమాదానికి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు తగిన సహాయం అందించాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నగరవ్యాప్తంగా ప్రమాదకర నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పూర్తిచేసి, ప్రాంత భద్రతను అధికారులు పరిశీలిస్తున్నారు.



## రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ హైమావతి

**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** రీజినల్ రింగ్ రోడ్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, సేకరించిన భూమిని నేషనల్ హైవే అధికారులకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాయని తెలిపారు. జిల్లాలో రాయపోల్, వర్గల్, మర్కుక్, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల మీదుగా రింగ్ రోడ్ వెళ్లనున్న నేపథ్యంలో భూసేకరణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆర్డీఓ ఆధ్వర్యంలో తహసీల్దార్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహించాలని, స్వాధీనం చేసుకునే భూముల్లో రైతులు కొత్త పంటలు వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భూసేకరణ పూర్తయిన వెంటనే నిబంధనల ప్రకారం భూమిని నేషనల్ హైవే అధికారులకు అప్పగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ నిర్మల, సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో 3340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో : కలెక్టర్ ప్రతిమా సింగ్



**చట్టం, మెదక్ ప్రతినిధి :**

జిల్లాలో రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 3340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవసరమైన మేరకే యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. యూరియా బుకింగ్ యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చర్యలు చేపడుతున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో 2025 ఆగస్టు వరకు 20,758 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయగా, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2026 ఆగస్టు వరకు 19,045 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ వివరించారు. ప్రతిరోజూ మండలాల్లో సుమారు 1000 నుంచి 1500 యూరియా బ్యాగులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆగస్టు 7 నుంచి FSS (Framework for Fertilizer Sale) ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన యాప్‌లో ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభంలో జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కడైనా ఎరువులు కొనుగోలు చేసుకునేలా అవకాశం కల్పించామని, దీంతో రైతులు తమ మండలంతో పాటు ఇతర మండలాల్లోనూ ఎరువులు కొనుగోలు చేయవచ్చని వెల్లడించారు. రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గత రెండు రోజులుగా డివిజన్ వారీగా ఎరువులు అందించేలా యాప్‌లో మార్పులు చేసినట్లు వివరించారు. అందుబాటులో ఉన్న ఎరువుల పరిమాణం కంటే అధికంగా రైతులు యాప్‌లో బుకింగ్ చేయడం వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమస్యలపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కు నివేదిక పంపామని, ఒక్కో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులు అవసరాలకు మించి ఎరువులను కొనుగోలు చేయడం వల్ల నిజంగా అవసరం ఉన్న రైతులకు సమయానికి ఎరువులు అందకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంట అవసరాలకు సరిపడే పరిమాణంలోనే ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని కోరారు. రైతులందరూ సమన్వయంతో వ్యవహరించి అందుబాటులో ఉన్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ విజ్ఞప్తి చేశారు.

## వచ్చే నెలలో విశాఖకు గోదావరి నీళ్లు!

**తీరనున్న తాగునీటి అవసరాలు**

**చట్టం, విశాఖపట్నం:**

విశాఖ నగర నీటి అవసరాలను తీర్చేందుకు గోదావరి జలాలను తరలించే ప్రక్రియ వేగం పుంజుకుంది. వచ్చే నెలలోనే విశాఖకు గోదావరి నీటిని అందించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నిర్ణీత గడువులో గోదావరి నీటిని విశాఖకు తీసుకొస్తామని ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విశాఖ వైపు మళ్లించే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. గతంలో రూపొందించిన ప్రణాళికల ప్రకారం గోదావరి ఎడమ కాలువ ద్వారా నీటిని ఏలేరు రిజర్వాయర్‌కు తరలించి, అక్కడి నుంచి విశాఖ అవసరాలకు వినియోగించే విధానం ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖకు గణనీయమైన నీటి లభ్యత పెరగనుంది. ప్రస్తుతం విశాఖ నగరం, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న తాగునీటి అవసరాల నేపథ్యంలో గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టుకు ప్రాధాన్యం పెరిగింది. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, సాధ్యమైనంత త్వరగా నీటిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.





## కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ రైజింగ్ కీలక చర్చలు

- విద్య, పరిశోధన, స్టార్టప్ రంగాల్లో భాగస్వామ్యానికి కార్యాచరణ ప్రణాళిక
- పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబు, ప్రతినిధి బృందం

**చట్టం, ఇంటర్నేషనల్ డెస్క్:**

తెలంగాణను ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ అభివృద్ధి తదితర రంగాల్లో కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై ఇరు వర్గాలు విస్తృతంగా చర్చించాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ఉన్న విద్యా, పరిశోధన, సాంకేతికత, పారిశ్రామిక అవకాశాలను తెలంగాణ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించింది. ప్రపంచంలోని ప్రముఖ విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని వివరించింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో కేంబ్రిడ్జ్ భాగస్వామి కావాలని ప్రతినిధి బృందం ఆహ్వానించింది. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట, 'ఫ్రూగల్ ఏఐ' కోచైర్ తెలంగాణలోని అవకాశాలపై సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో విద్య, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో కలిసి పనిచేయడానికి వారు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు చేపట్టడం, జ్ఞాన మార్పిడి కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. అలాగే యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్ సదుపాయాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రోత్సాహం వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి. ఈ భాగస్వామ్యాన్ని కేవలం చర్చలకే పరిమితం చేయకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. విద్యా కార్యక్రమాలు, పరిశోధన, స్టార్టప్‌లు, ఆవిష్కరణల రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను దశలవారీగా అమలు చేసేందుకు ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణకు ఏర్పడే భాగస్వామ్యం రాష్ట్ర విద్యా, పరిశోధన రంగాలకు కొత్త అవకాశాలను తెరవనుంది. ముఖ్యంగా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ చర్చలు మరింత ఊతమివ్వనున్నాయి. అంతర్జాతీయ స్థాయి సంస్థలతో భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాల్లో కేంబ్రిడ్జ్‌తో జరిగిన ఈ సమావేశం కీలక ముందడుగుగా నిలిచే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాకారం

▸ **మహేష్ కుమార్ గౌడ్**

**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** పేదల జీవిత స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అదనంగా నిజామాబాద్ జిల్లాకు మరిన్ని ఇళ్లు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ పేద కుటుంబానికి చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

**అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత**

దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత, పట్టణ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అర్బన్ లో డబుల్ బెడ్ రూమ్ టవర్లు నిర్మించాలి

▸ **అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి.. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



**చట్టం ఇందూరు :** నియోజకవర్గంలో స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించి ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరం లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరంలో పేదలకు స్థలం ఉండే అవకాశం లేదని, కావున ప్రభుత్వ స్థలంలోనే హైదరాబాద్ తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించాలని కోరారు. ప్రధానంగా రెండు దశల్లో గత 12 సంవత్సరాలుగా తెలంగాణలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వని నియోజక వర్గం కేవలం నిజామాబాద్ అర్బన్ మాత్రమే అన్నారు. ఇప్పటికైనా ఇవ్వడం సంతోషకరమన్నారు. ఇటీవల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకి సంబంధించి పలు అంశాలను తీసుకెళ్లానని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ఫోటో జర్నలిస్ట్ కె.సతీష్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ2026 పోటీల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన సాక్షి ఫోటో జర్నలిస్ట్ కె.సతీష్‌గౌడ్ రాష్ట్ర ఉత్తమ ఫోటో అవార్డు సాధించారు. శనివారం హైదరాబాద్ లోని IAS ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఇండియా లోని అన్ని ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులతో కలిసి కె.సతీష్ గౌడ్ కి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయకుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, అరుణ, రమేశ్, వనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీడీ స్కాలర్ షిప్ సదుపాయాన్ని వినియోగించుకోవాలి




**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్ షిప్ సదుపాయాన్ని విద్యార్థులు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని సిద్దిపేట జిల్లా దుబ్బాక బీడీ కార్మిక దవాఖాన మెడికల్ ఆఫీసర్ వెంకటేష్ కోరారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్యకు సంబంధిత కరపత్రం అందజేసారు. దుబ్బాక బీడీ కార్మిక దవాఖాన మెడికల్ ఆఫీసర్ వెంకటేష్, హైదరాబాద్ ప్రధాన కార్యాలయం అధికారి విజయ్ కుమార్. దుబ్బాక ఉద్యోగి రాములు కళాశాలకు విచ్చేసి, ఉపకార వేతనానికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. ప్రీ మెట్రిక్ (పదవ తరగతి వరకు) విద్యార్థులకు, పోస్ట్ మెట్రిక్ కళాశాల స్థాయి విద్యార్థులకు ఈ ఉపకార వేతనం పొందే అవకాశం ఉన్నదన్నారు. పదవ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు ఈ నెల 31 వరకు, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు (కళాశాల స్థాయి విద్యార్థులు) అక్టోబర్ 31 వరకు తమ తమ దరఖాస్తులను మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్ లైన్లో పంపించవచ్చని అన్నారు. నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ స్కాలర్ షిప్ పొందే వారు కూడా బీడీ కార్మిక ఉపకార వేతనం దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ఇందుకోసం విద్యార్థులు సమర్పించాల్సిన పత్రాల వివరాలను కూడా ఆయన తెలియజేశారు. 1) విద్యార్థి గత విద్యా సంవత్సరపు బోనాఫైడ్ సర్టిఫికెట్, 2) విద్యార్థి తల్లి/తండ్రి బీడీ కార్మికులు ఐతే వారి ఐడెంటిటీ కార్డు, 3)ఆధార్ కార్డు, 4) బ్యాంకు అకౌంట్ పాస్ బుక్, 5) రెండున్నర లక్షల లోపు ఆదాయ ధృవ పత్రం, 6) తల్లి లేదా తండ్రి జాయింట్ అకౌంట్ గా ఉండి, నేరుగా సదరు బ్యాంకు ఖాతాలో ఉపకార వేతనం జమ అయ్యే ఖాతా వివరాలు కూడా ఉండాలని మెడికల్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం దుబ్బాక లోని బీడీ కార్మిక దవాఖానలో గానీ, నేరుగా 9030953385 నంబర్ లో గానీ సంప్రదించాలని సూచించారు. లెక్చరర్లు శివకుమార్, తిరుపతిరెడ్డి, కే. రాజు, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ఐఎంఏ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీ పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఐఎంఏ ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నూతన తహసీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు శంకుస్థాపన



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్‌లో రూరల్ లో నూతన తహసీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఆధునిక వసతులతో నిర్మించనున్న ఈ కార్యాలయ భవనాలు ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన పరిపాలనా సేవలు అందించేందుకు దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పూర్తయిన వారికి ఆగస్టు 25న మెగా జాబ్ మేళా

▸ **హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగాల ఎంపిక**

**చట్టం /హనుమకొండ:** ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న 'టెక్ బీ ప్రోగ్రామ్' కోసం ఆగస్టు 25న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోపాల్ తెలిపారు. హనుమకొండ అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ఐసీఎస్సెస్ కంప్యూటర్ కేంద్రంలో ఉదయం 11:30 గంటలకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో MPC, జనరల్, ఒకేషనల్ ఏ గ్రూపులోనైనా ఇంటర్ పూర్తి చేసి, కనీసం 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో పాటు డిగ్రీ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని, సంవత్సరానికి రూ.2.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు వేతనం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫోటో, ఆండ్రాయిడ్ మొబైల్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

**మరిన్ని వివరాలకు జిల్లా ఇన్‌చార్జి నరేష్ – 7569177071 / 7981834205ను సంప్రదించాలని కోరారు.**

## గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడంతో పాటు, కళాశాలలో మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆధునిక వసతులతో తరగతి గదులు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం!



- **చర్యలకు అధిష్ఠానం రంగం సిద్ధం?**
- **పర్యటన వివాదం.. టికెట్ లొల్లి**
- **లండన్ నుంచే సీఎం ఆరా.. నోటీసులు జారీ**
- **క్రమశిక్షణా చర్యలు తప్పవు: పీసీసీ అధ్యక్షుడు**

**చట్టం రామాయంపేట :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆమె చేసిన విమర్శలు, ఆరోపణలపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం సైతం అత్యంత సీరియస్‌గా పరిగణించిందని, కేవలం నోటీసులకే పరిమితం కాకుండా క్రమశిక్షణా చర్యలు తీసుకునే యోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సమయంలో స్థానిక మంత్రి కొండా సురేఖ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డితో కొండా వర్గానికి ఉన్న విభేదాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే పరకాల బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.దీనిని తట్టుకోలేని కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. మరుసటి రోజే గీసుకొండలో సభ పెట్టి సీఎంపై, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. దిల్లీ పర్యటన ముగించుకుని లండన్ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అక్కడ నుంచే ఈ వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులు, కీలక నేతలతో మాట్లాడి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ ఇప్పటికే మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై మంత్రి స్పందిస్తూ.. కుమార్తె చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, దానికి తానెలా బాధ్యురాలినని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్ స్పందిస్తూ.. "ఎవరికి వారు ఇష్టమొచ్చినట్లు టికెట్లు ప్రకటించుకుంటే కుదరదు, టికెట్లపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం" అని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణా చర్యలు ఉంటాయని, మంత్రి ఇచ్చే వివరణను పరిశీలించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థుల సర్టిఫికెట్లపై నిర్లక్ష్యం.. భూముల పట్టాలపైనే ఆసక్తి

- **ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం**
- **నెల రోజులుగా సర్టిఫికెట్ కోసం విద్యార్థి ఎదురుచూపులు**
- **రామాయంపేట తహసిల్దార్ తీరుపై ప్రజల అసంతృప్తి**



**చట్టం రామాయంపేట :** విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరమైన సర్టిఫికెట్ల జారీ విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల రోజులుగా అవసరమైన సర్టిఫికెట్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన సమస్య పరిష్కారం కావడం లేదని ఓ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు సూచిస్తున్నప్పటికీ రామాయంపేట తహసిల్దార్ కార్యాలయంలో ఆ ఆదేశాలు అమలవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పై చదువులకు సర్టిఫికెట్లు అత్యవసరమైన సమయంలో విద్యార్థులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం సమంజసం కాదని స్థానికులు అంటున్నారు. విద్యార్థులు, యువతే ప్రజాస్వామ్యానికి పునాదులని చెప్పే పాలకులు వారి సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. మరోవైపు భూముల పట్టాలు, రెవెన్యూ సంబంధిత పనుల్లో మధ్యవర్తుల ప్రమేయం ఉందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. నేరుగా కార్యాలయానికి వెళ్లే అసలు పట్టాదారులు పలుమార్లు తిరిగినా పనులు జరగడం లేదని, మధ్యవర్తుల ద్వారా వెళితే మాత్రం పనులు త్వరగా జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది. రెవెన్యూ పాలనలో పారదర్శకత తీసుకురావాల్సిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విద్యార్థుల సర్టిఫికెట్లు సహా పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రామాయంపేట తహసిల్దార్ కార్యాలయ పనితీరుపై దృష్టి సారించి, ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మంత్రితో కలిసి ప్రభుత్వ స్థలం పరిశీలన



**చట్టం ఇందూరు :** నగరంలో స్థలం లేని వారికోసం డబుల్ బెడ్ రూమ్ టవర్ల నిర్మాణం కొరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నగరంలోని నాగారం స్టేడియం వద్ద గల రెండెకరాల స్థలాన్ని పరిశీలించారు. అలాగే కలెక్టరేట్ వద్ద గల డబుల్ బెడ్ రూమ్ లను కూడా పరిశీలించి వివరాలను ఆరా తీశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని, మరమ్మతులు చేయాలన్నారు. వీలైనంత తొందరగా అర్హులైన పేదలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

## శ్రావణ శనివారం.. వెంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలోని మోహినీపురలో ఉన్న వెంకటేశ్వర దేవాలయంలో శ్రావణ మాస శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో వచ్చే శనివారాలను భక్తులు అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. ముఖ్యంగా శ్రావణ శనివారాన్ని సంపత్ శనివారంగా భావిస్తూ వెంకటేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, దీపారాధన, అర్చనలు నిర్వహించారు. శ్రావణ శనివారాల్లో పిండి దీపాలు, ఆవు నెయ్యితో దీపారాధన చేయడం ప్రత్యేక ఆచారంగా కొనసాగుతోంది. భక్తులు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఆర్థిక స్థిరత్వం కోసం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసోత్సవాలు, పవిత్రోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వెంకటేశ్వర స్వామి అనుగ్రహం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శాశ్వత అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే భక్తులు ఆలయాన్ని సంప్రదించి అన్నదాన సేవలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

## సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** వేములవాడ పట్టణంలోని శనివారం మధ్యాహ్నం నిరాశ్రయులకు ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు, వీధియాచకులకు సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లీ బాబురావు మాట్లాడుతూ దాతల పేరు మీద యాచాకులకి పంపిణి చేయడం జరిగిందని, అలాగే ప్రతి దాతకు పేరు పేరు ధన్యవాదములు తెలియజేశారు. మాకు సహకరించిన దాతలు ఇట్యాల సౌజన్యకిషన్, కనగర్తి వాస్తవ్యులైన వారి కుమారుడు, శ్రీహర్షన్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపికులు ఎద్దండి రాజు ట్రస్ట్ కోశాధికారి దూలం భూమేష్‌గౌడ, వాసాల హరిప్రసాద్, గొంటీ నవీన్, ఇట్యాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయక సాగర్‌లో నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

▸ **జిల్లా మత్స్యశాఖ అధికారికి చంద్లాపూర్ మత్స్యకారుల వినతి**



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** రిజర్వాయర్లలో చేపల వేటకు సంబంధించి మత్స్యశాఖ అమలు చేస్తున్న నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామానికి చెందిన మత్స్యకారులు కోరారు. ఈ మేరకు శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపలు పట్టినట్లు ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చేపల వేట విషయంపై ప్రశ్నించిన మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం సభ్యులను దూషించినట్లు కూడా వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో చేపల వేటకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్దోళ్ల ఐలయ్య, పిల్లి ప్రభాకర్, ఏ. నరేష్, బి. నర్సింలు, డి. శ్రావణ్, బి. గణేష్, ఎం. గణేష్, పి. నాగరాజు, బి. ప్రకాష్, బి. అరుణ్, పి. కనకయ్య, పి. శేఖర్, కమలాకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మంగోల్ లో రామకోటి పుస్తకాల పంపిణి

▸ **10 కోట్ల శ్రీరామ నామ లిఖిత మహా సంకల్పానికి శ్రీకారం**

▸ **భక్తి మార్గంలో ప్రజలను నడిపిస్తున్న శ్రీరామకోటి భక్త సమాజం**



**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** శ్రావణమాసంలో లోకకల్యాణార్థం 10 కోట్ల శ్రీరామ నామ లిఖిత మహా సంకల్పానికి శ్రీరామకోటి భక్త సమాజం శ్రీకారం చుట్టిందని సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు తెలిపారు. శనివారం నాడు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మంగోల్ గ్రామంలో భద్రాచలం నుంచి వచ్చిన నూతన రామకోటి పుస్తకాలను ఆవిష్కరించి భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రీరామ నామాన్ని స్మరిస్తూ, లిఖిస్తూ ఈ మహా సంకల్పంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 10కోట్ల లిఖిత రామనామాలను పూర్తి చేయించి భద్రాచలం అందిస్తున్నామన్నారు. గత మూడు దశాబ్దాలుగా భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూ శ్రీరామ నామాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. భద్రాచల రామయ్య కళ్యాణానికి రెండుసార్లు గోటి తలంబ్రాలు అందించిన ఘనత మంగోల్ గ్రామానికి దక్కిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి కనకయ్య, కరుణాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిబాబా, అనిల్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, ట్రాఫిక్ మరియు సైబర్ క్రైమ్‌పై అవగాహన : ఎస్సై రాజు

**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం కేంద్రంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో, కళాశాల ప్రిన్సిపల్ మరియు సిబ్బంది సమక్షంలో సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు మరియు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిచ్కుంద ఎస్ఐ రాజు విద్యార్థులను ఉద్దేశించి డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అదేవిధంగా సైబర్ క్రైమ్స్ ఏ విధంగా జరుగుతున్నాయి, సైబర్ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, OTP, PIN, బ్యాంకింగ్ వివరాలు మరియు అనుమానాస్పద లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ మరియు డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను ఎలా వినియోగించుకోవాలో, దాని ప్రాముఖ్యతను కూడా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద ఎస్ఐ రాజు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది మరియు బిచ్కుంద పోలీస్ సిబ్బంది బాలరాజు, మహేందర్, వెంకన్న పాల్గొన్నారు.
"డ్రగ్స్‌కు నో చెప్పండి - ట్రాఫిక్ రూల్స్ పాటించండి - సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి.''

## చెన్నమ్మ కోరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

- **శ్రావణమాసం పురస్కరించుకొని అన్న ప్రసాదం**





**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం కొడిచీర గ్రామ శివారులో వెలసినటువంటి చెన్నమ్మ కోరి దేవస్థానంలో శ్రావణమాసం పురస్కరించుకొని రెండో శనివారం నాడు చిన్న ఎక్లార గ్రామస్తులు, భక్తులు శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో శ్రీ వీరభద్రుని దేవునికి జలాభిషేకము రుద్రాభిషేకము ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో శ్రావణ మాసం శనివారం పురస్కరించుకొని భక్తులు చెన్నమ్మ కోరి దేవస్థానంలోని కోనేరులో స్నానాలు చేసి శ్రీ వీరభద్రునికి చెన్నమ్మ మాతకు,శ్రీ చింతకుంట మహారాజ్ సమాధికి దర్శనము చేసుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అనంతరం చిన్న ఎక్లార గ్రామస్తులు, భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేసినారు. చుట్టుపక్కల ఉన్న వివిధ గ్రామాల భక్తులు, మహారాష్ట్ర కర్ణాటక నుండి వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించి ఆశీర్వాదం పొందినారు.

## ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి

- **భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్**



**చట్టం బిచ్కుంద;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో బిచ్కుంద మున్సిపల్ చైర్‌పర్సన్ సీమ సెట్కర్ , బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇల్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తో పాటు మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు బొగుడమీద సాయిలు మునిసిపల్ సిబ్బంది వీరారెడ్డి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు బొల్లివారి పోశెట్టి మరియు గైని గంగామణి బాబు ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, పేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రతి పేదవాని కళ్లల్లో ఆనందం చూడాలనే తపనతో, అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి, వారికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా కృషి చేస్తున్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పుణేలో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" లైవ్ కార్యక్రమాన్ని మహేష్ కుమార్ గౌడ్ వీక్షించారు. విద్యార్థులు, యువతకు సంబంధించిన అంశాలు, వారి సమస్యలు, భవిష్యత్ అవకాశాలపై నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, స్టేట్ కార్పొరేషన్ ఛైర్మన్లు తాహెర్ బిన్ హమ్దాన్, శేఖర్ గౌడ్, పీపీ దయాకర్ గౌడ్, మనాల మోహన్ రెడ్డి, నరాల రత్నాకర్, మజీద్ ఖాన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## వారధి అన్యువల్ జిల్లాస్థాయి కాంపిటీషన్స్‌లో వ్యాసరచన



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** స్థానిక ఇందిరానగర్ పాఠశాలలో నిర్వహించిన వారధి అన్యువల్ జిల్లాస్థాయి కాంపిటీషన్స్‌లో వ్యాసరచన విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘనపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రీ చెప్యాల విద్యార్థులు ద్వితీయ స్థానం, టీజీఎంఎస్ ఇబ్రహీం నగర్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. డిబేట్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ విద్యార్థుల ప్రథమ స్థానం, టి జి ఎం ఎస్ లచ్చపేట విద్యార్థులు ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నకోడూరు విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిద్దిపేట అర్బన్ మండల్ ఎంఈఓ రాజ ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షులు పూర్ణచందర్ మరియు ఉపాధ్యాయులు శ్రీనాకర్ రెడ్డి, నాగరాజు, నవీన్ కుమార్ లు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు మెమొంటోస్ ను అందించడం జరిగినది.

## జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలి

- **నిర్మల్ పట్టణంలోనీ బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి బీజేవైఎం నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేవైఎం నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా ( బీజేవైయం) జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్లు సూరజ్ నాయక్, సాత్విక్, బీజేవైఎం నాయకులు వెంకటేష్, భరత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం

- **హరీష్ రావు**
- **కాళేశ్వరం జలాలతో సిద్ధిపేటలో ఆయిల్ పామ్ సాగుకు నాంది**
- **60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్‌తో నర్మేట ఫ్యాక్టరీ అద్భుత విజయం**
- **రిఫైనరీ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచన**



**చట్టం – సిద్ధిపేట ప్రతినిధి :** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డితో కలిసి శనివారం సిద్ధిపేట నియోజకవర్గంలోని నర్మేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను పరిశీలించిన హరీష్ రావు, ఫ్యాక్టరీ నిర్మాణం, ఆయిల్ పామ్ క్రషింగ్ ప్రక్రియ, పామ్ ఆయిల్ తయారీ విధానాన్ని ప్రశాంత్ రెడ్డికి వివరించారు. కాళేశ్వరం జలాలు ఈ ప్రాంతానికి అందుబాటులోకి రావడంతో ఆయిల్ పామ్ సాగుకు నాంది పడిందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతులకు మంచి ఫలితాలు రావడం సంతోషకరమని తెలిపారు. నర్మేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అనతి కాలంలోనే 60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి చేయడం గొప్ప విజయమని పేర్కొన్నారు. పంట ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నందున మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు రావాలని పిలుపునిచ్చారు. రైతులకు అవసరమైన ఆయిల్ పామ్ మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సాగు చేపట్టాలనుకునే రైతులకు మొక్కలు, సాంకేతిక సలహాలు, సాగు పద్ధతులపై అధికారులు ఎప్పటికప్పుడు సహకారం అందించాలని సూచించారు. నర్మేట ఫ్యాక్టరీలో రిఫైనరీ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సంబంధిత పనులను వెంటనే ప్రారంభించాలని ఆయిల్ ఫెడ్ అధికారులకు సూచించారు. పంటను క్రషింగ్ కోసం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫ్యాక్టరీ అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

## రూపా రెడ్డి హత్యకు నిరసనగా ఎస్ఎఫ్ఐ కొవ్వొత్తుల ర్యాలీ




- **ప్రైవేట్ టీచర్లకు భద్రత కల్పించాలి : ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్**

**చట్టం న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఘటన అత్యంత బాధాకరమని ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ పేర్కొన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ రూపా రెడ్డికి నివాళులు అర్పించేందుకు, కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రూపా రెడ్డిపై విద్యార్థులు కత్తితో పలుమార్లు దాడి చేసి హత్య చేసినట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని రవీందర్ తెలిపారు. ఇంట్లోని నగదు తీసుకెళ్లినట్లు వస్తున్న సమాచారంపైనా సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు, వేధింపులు జరిగినప్పుడు తక్షణమే స్పందించే ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థ, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మానసిక స్థితిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల్లో మానసిక ఒత్తిడి, కోపం, ఒంటరితనం, ప్రవర్తనలో మార్పులు, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలను ముందుగానే గుర్తించేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో సైకాలజీ కౌన్సెలర్లను అందుబాటులో ఉంచి విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, భావోద్వేగ నియంత్రణ, మానవ సంబంధాలు, హింసకు దూరంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించాలని కోరారు. కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా నైతిక విలువలు, మానవతా దృక్పథం, పరస్పర గౌరవం, బాధ్యత వంటి అంశాలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాల మధ్య సమస్యలు తలెత్తినప్పుడు హింసకు తావులేకుండా కౌన్సెలింగ్, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలను ప్రతి విద్యాసంస్థలో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతకు బాధ్యత వహించేలా ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూపా రెడ్డి కుటుంబానికి ఎస్ఎఫ్ఐ ప్రగాఢ సానుభూతి, సంఘీభావం తెలియజేస్తోందని రవీందర్ తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతును చొక్కా పట్టి లాగిన ట్రాఫిక్ సీఐపై ఫిర్యాదు


- **గొర్రెల లోడుతో వెళ్తున్న వాహనాన్ని అడ్డుకుని.. రైతుపై దౌర్జన్యం చేశారంటూ ఆరోపణలు**
- **షాద్ నగర్ ట్రాఫిక్ సిఐ శంకరయ్య దౌర్జన్యం**
- **రైతును చొక్కా పట్టి వాహనం నుండి బయటకి లాగిన సీఐ**
- **ట్రాఫిక్ సిఐపై డిసిపి శివం ఉపాధ్యాయకు ఫిర్యాదు**
- **కమ్మేట గ్రామ రైతు కాంత్ రెడ్డి గల్లా పట్టి బయటికీడ్చిన సీఐ**
- **తన వాహనం నుండి బలవంతంగా గొర్రెలను దింపి రోడ్డుపై వదిలేసిన వైనం**



**చట్టం , షాద్ నగర్ ప్రతినిధి:–** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ ట్రాఫిక్ సీఐ శంకరయ్యపై రైతు కాంత్‌రెడ్డి దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు చేశారు. తనను చొక్కా పట్టుకుని వాహనం నుంచి బయటకు లాగడంతో పాటు, తన కుమారుడిపై చేయి చేసుకున్నారని కాంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చేవెళ్ల మండలం కమ్మెట గ్రామానికి చెందిన రైతు కాంత్‌రెడ్డి శనివారం గొర్రెలను పెబ్బేరు సంతలో కొనుగోలు చేసి ఓ వాహనంలో తీసుకెళ్తుండగా షాద్‌నగర్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహన డ్రైవర్ మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని కూడా పోలీసుల అదుపులోకి తీసుకుంటామని సీఐ శంకరయ్య చెప్పినట్లు కాంత్‌రెడ్డి తెలిపారు. అయితే వాహనంలో గొర్రెలు ఉన్నాయని, వాటిని రోడ్డుపై దింపితే ఇబ్బందులు తలెత్తుతాయని సీఐకి వివరించినట్లు చెప్పారు. డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అతని లైసెన్సును స్వాధీనం చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో సీఐ శంకరయ్య తనపై ఆగ్రహం వ్యక్తం చేసి, చొక్కా పట్టుకుని వాహనం నుంచి బయటకు లాగారని కాంత్‌రెడ్డి ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నించిన తన కుమారుడు నితీష్‌రెడ్డిపై కూడా చేయి చేసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా వాహనంలోని గొర్రెలను బలవంతంగా రోడ్డుపై దింపి, వాహనాన్ని పోలీసుల అదుపులోకి తీసుకున్నారని కాంత్‌రెడ్డి ఆరోపించారు. తనను, తన కుమారుడిని దూషిస్తూ అవమానించారని, చేయి చేసుకున్నాడని, రైతు అనే గౌరవం కూడా చూడకుండా వ్యవహరించారని కాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రశ్నించినప్పుడు కేసులు పెడతామని బెదిరించడం సరికాదని అన్నారు. ఈ ఘటనలో అందరూ చూస్తుండగానే రైతును కింద పడేసి మరి లాక్కెళ్లారని తెలిపారు. అవసరమైతే నీమీద కేసు పెడతా అంటూ మరి శంకరయ్య బెదిరించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై సీఐ శంకరయ్య వివరణ కోరేందుకు మీడియా ప్రయత్నించగా ఆయన ఫోన్ స్పందించలేదని తెలిసింది. ఘటనపై ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలని కోరినట్లు చెప్పారు. తప్పు చేసిన డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే రైతులపై దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదని కాంత్‌రెడ్డి అన్నారు. తనకు న్యాయం జరగకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షాబాద్ సిఐ గా ఉన్న సమయంలో ఏసీబీకి అడ్డంగా పట్టుబడి అవినీతికి పాల్పడిన కేసు ఆయనపై ఉందని అలాంటి వ్యక్తి ప్రజల పట్ల ఎలా వ్యవహరిస్తారు ఉన్నతాధికారులు అర్థం చేసుకోవాలని ఈ ప్రాంతంలో కూడా సిఐగా వ్యవహరించినప్పుడు అనేక అక్రమాలకు దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా బాధిత తరుపు వారు మీడియాకు సమాచారం అందజేశారు.

## జీవో నెంబర్ 97 ను వెంటనే రద్దు చేయాలి

- **పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు**
- **బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు**



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 97 ను వెంటనే రద్దు చేయాలని, విద్యార్థి వ్యతిరేక విధానాలను విడనాడాలని, పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడడం మానుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ పేరుతో సాంకేతిక విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి ఎస్బిటెట్ వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో తీసుకు వస్తున్న విధానాల ద్వారా పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఐటిఐ ఏ టి సి లతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు వారం రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. నిరుపేద , పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే పాలిటెక్నిక్ లో చేరి డిప్లమా పూర్తి చేసి ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో చేరుతారని లేదా ఉద్యోగాలు చూసుకుంటారన్నారు. పాలిటెక్నిక్ విద్య అనేది ప్రత్యేకమైన సాంకేతిక విద్యావ్యవస్థ అని, దాని ప్రమాణాలను మరింత పెంచాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా డిప్లమా కోర్సులను ఇతర శిక్షణా కోర్సులలో అనుసంధానం చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. న్యాయమైన డిమాండ్స్ సాధనకై విద్యార్థులు ఆందోళన బాట పడితే సమస్యలను పరిష్కరించే బదులు పోలీసుల ఉసిగొలిపి దారుణంగా కొట్టించడమేంటని ప్రశ్నించారు. మహబూబాబాద్ లో విద్యార్థి గొంతును సిఐ పిసకడం, హైదరాబాదులోకూర్చున్న విద్యార్థి కాలుపై పోలీస్ బైక్ నడిపించి కాలు విరగొట్టడం, విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేయడం దారుణం అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దమన కాండ ఆపాలని, కిరాతకంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కోర్సులను ఇంజనీరింగ్ విద్యకు అనుసంధానిస్తూ ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ పేరుతో డిప్లమా విద్యను డీగ్రేడ్ చేసే విధానాలను తీసుకురావడం రావడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాట మాడకుండా పాలిటెక్నిక్ విద్యార్థులు మరియు విద్యా నిపుణులతో సమగ్రంగా చర్చించి సత్వరమే తగిన నిర్ణయాలు తీసుకోవాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని, లేనిచో విద్యార్థుల సమ్మె ఉధృతమయితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## సురవరం సుధాకర్ రెడ్డి పాట విడుదల చేసిన చాడ వెంకటరెడ్డి




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** శనివారం కరీంనగర్ లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ పార్లమెంటు సభ్యులు అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి స్మృతి గీతాన్ని ఎస్.కె.మీరా రచన చేసిన పాటకు సంగీతం, గానం గడిపె మల్లేశ్ చేసిన పాటను సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిపిఐ అగ్ర నేత సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను పునికి పుచ్చుకొని సమస్యలపై తన గళం విప్పేవారని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన విధానాలు, ఆయా దేశాల పరిపాలనపై అధ్యయనం చేస్తూ దేశంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించేవారని అపర మేధావిగా, సౌమ్యుడిగా, అందరికీ ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. ప్రజల కోసమే జీవించే నాయకులు అరుదుగా ఉంటారని, వారు చేసిన త్యాగాలు, మంచి పనులు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, వారిని గుర్తు చేసుకోవడం కోసం కవులు కళాకారులు అనేక వ్యాసాలు, పాటలు వ్రాస్తారని ఆ పాటలు చిరస్మరణీయంగా ఉంటాయని సుధాకర్ రెడ్డి పై పాట వ్రాసిన ఎస్.కె.మీరా ను, సంగీతం సమకూర్చి పాడిన గడిపె మల్లేష్‌ను చాడ వెంకటరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య, మెగిలిపాలెం సదానందం, సిపిఐ నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, టేకుమల్ల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

- **సమాజ అభ్యున్నతికి ఆయన కృషి నేటి తరానికి ఆదర్శం**
- **మాజీ జడ్పీటీసీ గుత్ప విజయ్ భాస్కర్ రెడ్డి**



**చట్టం న్యూస్, మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలో మోట్టాడి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ గుత్ప విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి సమాజ అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య అందేలా విశేష కృషి చేశారని తెలిపారు. యువతకు సరైన మార్గదర్శకత్వం అందిస్తూ సమాజ సేవలో ప్రత్యేక ముద్ర వేసిన ఆయన సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సంఘం అధ్యక్షుడు బిల్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. విద్య, సామాజిక సేవ, ప్రజా సంక్షేమ రంగాల్లో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, పసుల లింగారెడ్డి, నాగిరెడ్డి, అక్షయ్ రెడ్డి జంగా, రామకృష్ణ రెడ్డి, గుత్ప సైనాపురం నర్సారెడ్డి, టేకులపల్లి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురు పురస్కార ప్రధానోత్సవం




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి కి చెందిన ఎస్.గంగా శ్రీనివాస్(గురు స్వామి), కు శనివారం రోజు హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాజ గాన సభ యందు ఘనంగా సన్మానించారు. గత 21 సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తూ, సేవా భావాలతో తన వంతు ఆర్థిక సహాయ కార్యక్రమాలు చేస్తుండడంతో పండల రాజ వంశీయులు రాజు తిరునాల్ సురేష్ వర్మ చేత సత్కరించబడ్డారు. ఈ కార్యక్రమంలో మహాశాస్త్ర సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ రాజు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిరోజూ ప్రజాపాలన

- **ఐదు మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతుల స్వీకరణ, అధికారులకు ఎమ్మెల్యే జారే ఆదేశాలు**



**చట్టం అశ్వారావుపేట :** ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపించడమే లక్ష్యంగా అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ప్రతిరోజూ ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం దమ్మపేట మండలం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

**ప్రజలతో నేరుగా ఎమ్మెల్యే ముఖాముఖి**

గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో సందడి నెలకొంది. తమ సమస్యలను పరిష్కరించుకోవాలనే ఆశతో వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందజేసిన వినతిపత్రాలు, దరఖాస్తులను స్వీకరించి, వాటిలోని అంశాలను పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలను వివరించిన సందర్భంగా వాటిని పూర్తిగా విన్న ఎమ్మెల్యే, సంబంధిత శాఖలకు చెందిన అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. తక్షణమే పరిష్కరించే అవకాశం ఉన్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అధికారులతో సమన్వయంతో సమస్యల పరిష్కారం**

ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ప్రతి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, ప్రజాప్రతినిధిగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, విద్యుత్, రహదారులు, తాగునీరు, సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణం, భూసంబంధిత అంశాలు తదితర అనేక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కో సమస్యకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధి**

అశ్వారావుపేట నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రతిరోజూ ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ప్రజలు నేరుగా తనను కలిసి తమ సమస్యలను చెప్పుకునే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సేవలు సకాలంలో అందించాలని సూచించారు.

**సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

కేవలం వినతిపత్రాలను స్వీకరించడంతో ప్రజాపాలన కార్యక్రమం ముగియకుండా, వాటి పరిష్కారానికి తదుపరి చర్యలు ఉండేలా ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, సమస్య స్వభావాన్ని బట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు వివరించే అవకాశం లభించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఓపికగా విని, అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించేందుకు ఆదేశాలు ఇవ్వడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం**

అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని అన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను కూడా పరిగణనలోకి తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు.

నిరంతరం కొనసాగనున్న ప్రజాపాలన ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ప్రజాపాలన కార్యక్రమం ద్వారా తన దృష్టికి తీసుకురావచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండడం, వారి సమస్యలను పరిష్కరించడం, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వస్తే ఈ 5 లక్షణాలు డేంజర్! డాక్టర్ దీపక్ రెడ్డి

- **వర్షా కాలంలో డెంగ్యూ జాగ్రత్తలు తప్పనిసరి: సన్‌రైజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దీపక్ రెడ్డి**




**చట్టం నిజామాబాద్:** వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు వివిధ రకాల వైరల్ జ్వరాలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ ఖలీల్‌వాడిలోని సన్‌రైజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దీపక్ రెడ్డి సూచించారు. చట్టం టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వర్షాకాలంలో దోమల ద్వారా డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు, కలుషిత ఆహారం మరియు నీటి ద్వారా టైఫాయిడ్, లెప్టోస్పైరోసిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. వైరల్ ఫ్లూ, న్యూమోనియా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు కూడా ఈ కాలంలో ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు.డెంగ్యూ జ్వరంలో అకస్మాత్తుగా అధిక జ్వరం, కళ్ల వెనుక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలిపారు. తీవ్రమైన కడుపునొప్పి, నిరంతర వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తస్రావం, నల్లటి మలం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చిన్న చిన్న నొప్పులు, జ్వరాలకు స్వయంగా మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేసి వాడటం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డాక్టర్ సలహా లేకుండా కొన్ని రకాల పెయిన్‌కిల్లర్లు తరచుగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని చెప్పారు. జ్వరం తీవ్రంగా ఉండటం లేదా ఇతర లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు.వర్షాకాలంలో వీలైనంత వరకు ఇంట్లో వండిన తాజా ఆహారాన్నే తీసుకోవాలని, కాచి చల్లార్చిన లేదా సురక్షితమైన నీటిని తాగాలని సూచించారు. రోడ్డు పక్కన బహిరంగంగా ఉంచే ఆహార పదార్థాలను నివారించాలని చెప్పారు. డెంగ్యూ సమయంలో కారంగా, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తగ్గించి, తేలికగా జీర్ణమయ్యే ఆహారం, పండ్లు తీసుకోవడం మంచిదన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు పాటించడం ద్వారా డెంగ్యూ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని డాక్టర్ దీపక్ రెడ్డి సూచించారు.

## నేడు రెండు గంటల విద్యుత్ అంతరాయం



**చట్టం రామాయంపేట :** రామాయంపేట మున్సిపల్ పరిధిలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అభివృద్ధి పనుల కారణంగా రెండు గంటల పాటు సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు సజావుగా పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులకు వినియోగదారులు సహకరించాలని ఏఈ తిరుపతిరెడ్డి కోరారు.

## అశ్వారావుపేట మండలంలో ఇసుక అక్రమ రవాణా



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో అక్రమ ఇసుక రవాణా నిత్యకృత్యంగా మారింది. ఆర్టీఓ (రవాణా శాఖ), పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల కళ్లముందే ఎటువంటి కాగితాలు, పత్రాలు లేని ట్రాక్టర్లు యథేచ్ఛగా రోడ్లపై నడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు ప్రజలకు రావలసిన సహజ వనరుల ఆదాయానికి గండి కొడుతూ కోట్లు ఆర్జిస్తున్నారు. తనిఖీలు లేవు.. పత్రాలు లేని వాహనాలకు అడ్డూ లేదు! రవాణా శాఖ అధికారులు కనీసం రహదారులపైకి వచ్చి వాహనాల కాగితాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, చివరకు నంబర్ ప్లేట్లు కూడా లేని ట్రాక్టర్లను మైనర్లు నడుపుతుంటే అధికారులు ఏ రకమైన నిద్ర పోతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పుడప్పుడు పోలీసులు నామకార్థం తనిఖీలు చేసి నామమాత్రపు కేసులు, ఫైన్లకే పరిమితం చేస్తున్నారే తప్ప, ఈ అక్రమ రవాణాను శాశ్వతంగా అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. రాజకీయ అండదండలతో చెలరేగుతున్న మాఫియా ఇసుక అక్రమ రవాణా వెనుక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల హస్తం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన మైనింగ్ రాయల్టీని కొల్లగొడుతూ, తమ స్వార్థం కోసం నాయకులు ఈ దందాను ప్రోత్సహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులతో ఉన్న పరిచయాలు, రాజకీయ ఒత్తిళ్లతో చట్టాన్ని తమ జేబులో పెట్టుకుని అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. రోడ్లపై మృత్యుఘంటికలు - మైనర్ల చేతిలో వాహనాలు ఎటువంటి పర్మిషన్లు లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ కనీసం వయస్సు కూడా లేని మైనర్ యువకులు ఇసుక ట్రాక్టర్లను నడుపుతూ రోడ్లపై మృత్యుఘంటికలు మోగిస్తున్నారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు తోలుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

## వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంటర్ వద్ద మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్ ఉపాధ్యాయుల సూర్యప్రకాష్ రావు, మండల అధ్యక్షులు కురి శెట్టి నాగబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆగస్టు 23 ఆదివారం సాయంత్రం మూడు గంటలకు వంగవీటి రాధా చేతులు మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, గ్రంథాలయం చైర్మన్ పసుపులేటి వీరబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, వనమా వెంకటేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం పాల్గొంటారని స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ కళాశాల నుండి కార్, బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంశెట్టి సత్యనారాయణ, తాడేపల్లి రవి, తోట దుర్గారావు, దండా బత్తుల నరేష్, కట్ట సుబ్బారావు, ఆకుల శ్రీను, చిన్నంశెట్టి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


## జూదగాళ్ల గుట్టురట్టు.. 8 మంది అరెస్ట్

- **రూ.4,170 నగదు.. 4 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం**



**చట్టం / ఎల్లారెడ్డి :** జూదంపై ఎల్లారెడ్డి పోలీసులు కొరడా ఝుళిపించారు. శనివారం బ్రహ్మన్‌పల్లి ప్రకృతి వనం, మీసన్‌పల్లి గ్రామ శివారులో దాడులు నిర్వహించి జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,170 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

## కాచాపూర్ గ్రామంలో రోడ్డు భద్రతా చర్యలు



**చట్టం శంకరపట్నం :** మండల కేంద్రంలోని కాచాపూర్ గ్రామ రోడ్డు సేఫ్టీ కమిటీ చైర్మన్, సర్పంచ్ ఊకంటి మాధవిమధుకర్ ఆధ్వర్యంలో ఆముదాలపల్లి-వీణవంక ప్రధాన రహదారిలోని ఎల్‌షేప్ ప్రమాదకర మలుపు వద్ద శనివారం రోడ్డు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ మలుపు వద్ద వాహనదారుల కంటికి కనిపించకుండా అడ్డుగా ఉన్న చెట్ల పొదలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. అలాగే గతంలో దెబ్బ తిన్న డబ్ల్యూబీమ్ రక్షణ గోడను సరిచేసి (రిక్టిఫై చేసి) తిరిగి బిగించారు. రాత్రివేళల్లో సైతం వాహనదారులు మలుపును దూరంచూపేలా ముందస్తుగా గుర్తించేందుకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ చందు, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాడికల్ లో ముగిసిన రెండో రోజు ఆత్మ ఆర్పి ఎల్ శిక్షణ కార్యక్రమం



**చట్టం :శంకరపట్నం :** శంకరపట్నం మండలం తాడికల్ రైతువేదికలో 'ఆత్మ' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆర్.పి.ఎల్' శిక్షణ కార్యక్రమం శనివారం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా వరి పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన ఆధునిక సాగు పద్ధతులు, పురుగులుతెగుళ్ల యాజమాన్యం మరియు సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయిల్ పామ్ అధికారులు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగు, సాంకేతిక అంశాలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరంగా తెలియజేశారు. రైతులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించి, నికర ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఏడిఏ శ్రీధర్, కేవీకే శాస్త్రవేత్త డి. శ్రీనివాస్ రెడ్డి, శంకరపట్నం ఏఓ వెంకటేష్, ఆత్మ ప్రతినిధి అర్చన, ఏఈఓ లు శంకరపట్నం మండల రైతులు పాల్గొన్నారు.

## గోపాల్ పూర్‌లో అంబరాన్ని అంటుతున్న తీజ్ సంబరాలు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** హన్మకొండ 56వ డివిజన్ లోని గోపాల్పూర్ బాలాజీ కాలనీ రోడ్ నెంబర్ రెండు లో గత 15 సంవత్సరాలుగా బంజారాలు ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు అందులో భాగంగా ఈ సంవత్సరం 18.8. 2026 ఆరు నుండి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఐదవ రోజుకు చేరుకున్నాయి. బంజారాల్లో పెళ్ళికాని అమ్మాయిలు జరుపుకునే ఈ పండుగను చాలా పవిత్రంగా తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో జరుపుతారు ప్రకృతిని ఆరాధించే గింజల తెగల్లో బంజారా తెగ ఒకటి అందులో భాగంగానే ప్రకృతిని పూజిస్తూ సమాజం నిత్యం పచ్చగా కలకలాడుతూ అందరి జీవితాల్లో ఆనందం వెల్లి విరియాలని,తమకు మంచి భర్త దొరకాలని కోరుకుంటూ 9 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ తొమ్మిది రోజుల్లో బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు కులదైవాలకు సంబంధించిన చరిత్రను తెలుసుకుంటూ ముందు తరాల వారికి అందించడం ఈ పండుగ ప్రత్యేకత. ఈ పండుగను ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరుపుకుంటారు. ఈ కార్యక్రమాలను గోపాల్పూర్ సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాపవత్ రామల్ నాయక్, పోరిక రాజారాం నాయక్, కమిటీ కన్వీనర్ భానోత్ వెంకన్న, గౌరవ సలహాదారులు తేజావత్ జవహర్ నాయక్, గౌరవ అధ్యక్షులు బానోతు జవాహర్ లాల్ నాయక్, సహాయ కార్యదర్శి కొర్ర ధరమ్ సింగ్, పాడియా శివరాం తదితరులు పర్యవేక్షణలో ప్రతిరోజు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

## ఆయిల్‌పామ్ వైపు అడుగులు.. లాభాల పంటలపై గురి

- **వర్షా భావానికి వ్యూహం.. తక్కువ నీటితో అధిక దిగుబడులపై అవగాహన**




**చట్టం / ఎల్లారెడ్డి :** వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటూ తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పంటల వైపు రైతులు అడుగులు వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం మాచాపూర్ గ్రామంలో (ఏటిఎంఏ ) అగ్రికల్చరల్ టెక్నాలజీ మానేజ్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నూనెగింజలు, ఆయిల్‌పామ్ సాగు ప్రయోజనాలను వివరించారు. ఫామ్ పాండ్ల నిర్మాణంతో నీటిని పొదుపు చేసుకోవాలని, ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయిల్‌పామ్ క్షేత్రాన్ని సందర్శించి రైతులకు సాగు మెళకువలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.

## ప్లాస్టిక్ నిషేధంపై భాష్యం విద్యార్థుల అవగాహన ర్యాలీ

- **ప్లాస్టిక్ వద్దు– పర్యావరణమే ముద్దు.. కరస్పాండెంట్ జయంతి**




**చట్టం వెల్దుర్తి:** ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణానికి జరిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు భాష్యం స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులచే ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు తెలియపరిచేందుకు "ప్లాస్టిక్ వద్దు పర్యావరణమే ముద్దు"అనే నినాదలతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ కరస్పాండెంట్ జయంతి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుపుతూ ప్లాస్టిక్ బ్యాగుల బదులు గుడ్డ సంచులు నారా సంచులు మాత్రమే వాడుకొని మనమందరం ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వాడకాన్ని దూరం చేసి పర్యావరణ పరిరక్షణలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ఇంచార్జ్. రామకృష్ణ, కుస్తీ వాసంతి, వంచ నాగలక్ష్మి, వర్ష, షబానా, సంధ్య, నిహారిక, రేణుక, భావన, వేణు, తదితర ఉపాధ్యాయ బృందం పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ భారీ ధర్నా.. హైవేపై రాస్తారోకోతో నిలిచిన వాహనాలు

- **విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకోవద్దు : కౌన్సిలర్ భూక్యా ఉదయ జ్యోతి**
- **న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు : సత్యవరపు సంపూర్ణ**



**చట్టం అశ్వారావుపేట :** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీఆర్ఎస్ పిలుపు మేరకు అశ్వారావుపేటలో భారీ ధర్నా నిర్వహించారు. మాజీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైవేపై రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. జీవో 97కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 97 అమలుతో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. మాజీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ మాట్లాడుతూ జీవో 97ను రద్దు చేయకపోతే విద్యార్థుల తరపున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపాలిటీ బీఆర్ఎస్ కౌన్సిలర్ డా. భూక్యా ఉదయ జ్యోతి ఆధ్వర్యంలో అశ్వారావుపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవద్దని, జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్య ప్రసాదు, జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, జూపల్లి రమణ రావు, గుడవర్తి వెంకటేశ్వరరావు, జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి, జక్కుల రాంబాబు, మందపాటి మోహన్ రెడ్డి, మోటూరి మోహన్, ఆరెపల్లి గోవింద్, పాలవలస జీవన్ రావు, శెట్టిపల్లి రఘురాం, తగరం జగన్నాథం, సోమని రమేష్, బాలి కిరణ్, ఉప సర్పంచ్ సంగీతం రాజు, మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్, శ్రీకాళహస్తి, అప్పారావు, తోట వెంకటస్వామి, గెద్దం మంగరాజు, మనోహర్, కొనాకళ్ల గంగయ్య, పుల్లారావు, ముత్యాలరావు, రామ్ లక్ష్మయ్య, వెంకటేశ్వరావు, కొండయ్య, సుబ్బారావు, సతీష్, గోపీచంద్, చిరంజీవి, చెన్నారావు, ప్రశాంత్, కర్ణాకర్, చరణ్ బాబు, శ్రీను, రాజేష్, కిరణ్, చింటూ, సాగర్, పావన్, సర్పంచ్ బేటి రాంబాబు తదితర పార్టీ శ్రేణులు, విద్యార్థి, యువజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవాబ్‌పేట్ పరిధిలో 110 సీసీటీవీ కెమెరాలు ప్రారంభం



- **సీసీటీవీ నిఘాతో నేరాల నియంత్రణకు మరింత బలం : ఎస్పీ స్నేహ మెహ్రా**

**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన “వికారాబాద్ రక్షణ నేత్రం” కార్యక్రమంలో భాగంగా నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 110 సీసీటీవీ కెమెరాలను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రారంభించారు. నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యావపూర్ గ్రామంలో 24, నవాబ్‌పేట్‌లో 16, గొల్లగూడలో 12, పులుమామిడి గ్రామంలో 14, కొజ్జావనం పల్లిలో 16, ముబారక్‌పూర్‌లో 28 చొప్పున మొత్తం 110 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన ప్రాంతాలు, రహదారులు, కూడళ్లలో జరిగే కార్యకలాపాలను పోలీస్ స్టేషన్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, “వికారాబాద్ రక్షణ నేత్రం” ద్వారా జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సీసీటీవీ నిఘా వ్యవస్థను విస్తరించి సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణతో పాటు నేరం జరిగిన తర్వాత నిందితులను గుర్తించడం, వారి కదలికలను పసిగట్టడం, నేర పరిశోధనకు అవసరమైన ఆధారాలను సేకరించడంలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు శాంతిభద్రతల పర్యవేక్షణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికల గుర్తింపు, రోడ్డు భద్రత, నేరాల నియంత్రణ, నేర పరిశోధనలో పోలీసులకు మరింత సహకారం అందిస్తాయని తెలిపారు. గ్రామాల భద్రత కోసం ప్రజలు కూడా సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటులో భాగస్వాములు కావాలని సూచించారు.

**షటిల్ కోర్టు, ప్రహరీ గోడ ప్రారంభం**

నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు, ప్రహరీ గోడను కూడా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రారంభించారు. విధుల్లో నిత్యం ఒత్తిడితో పనిచేసే పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు క్రీడా సదుపాయాలు ఉపయోగపడతాయని తెలిపారు. సిబ్బంది క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు, ప్రహరీ గోడ, బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలను ఎస్పీ అభినందించారు. ప్రజల సహకారంతో సీసీటీవీ నిఘా వ్యవస్థను మరింత విస్తరించి “సురక్షిత వికారాబాద్” నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరన్నా, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
ఆదివారం
23.08.2026


# రాజ్ బహదూర్ ఆశయాలతో సమాజ సేవలో ముందుండాలి

- సిద్దిపేటలో వెంకట్రామ రెడ్డి విగ్రహావిష్కరణ
- పేద విద్యార్థుల చదువులకు ఫంక్షన్ హాల్ ఆదాయం వెచ్చించాలని సూచన
- సంఘాలు పదవుల కోసం కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి




**చట్టం - సిద్దిపేట ప్రతినిధి :**

సిద్దిపేట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాజ్ బహదూర్ వెంకట్రామ రెడ్డి 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన వెంకట్రామ రెడ్డి విగ్రహాన్ని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం పెద్దలు, నూతన కమిటీ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ఒక వ్యక్తి తాను మాత్రమే ఎదగడం గొప్పతనం కాదని, తనతో పాటు మరో పది మందిని పైకి తీసుకురావడమే నిజమైన గొప్పతనమని పేర్కొన్నారు. ఇందుకు రాజ్ బహదూర్ వెంకట్రామ రెడ్డి జీవితం గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. హైదరాబాద్ కోత్వాల్‌గా పనిచేసిన సమయంలోనే భవిష్యత్ తరాల అవసరాలను గుర్తించి విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు విద్యావకాశాలు కల్పించేందుకు రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసిన దార్శనికుడు వెంకట్రామ రెడ్డి అని కొనియాడారు. కీర్తిశేషులు జైపాల్ రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, ముక్కిస సత్యనారాయణ రెడ్డి వంటి పెద్దల ఆలోచనలతో ప్రారంభమైన సిద్దిపేట రెడ్డి సంఘం నేడు ఉన్నత స్థాయికి చేరుకుందని తెలిపారు. ప్రస్తుత అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలోని నూతన కమిటీ సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. సిద్దిపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగపడే హాస్టల్ లేదా పాఠశాల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన తన దృష్టికి వచ్చిందని హరీశ్ రావు తెలిపారు. కమిటీ సభ్యులు చర్చించి అవసరమైన ప్రాజెక్టును నిర్ణయిస్తే తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. 201213 ప్రాంతంలో రెడ్డి భవన నిర్మాణం ప్రారంభించామని, సిద్దిపేటలో తొలి ఏసీ ఫంక్షన్ హాల్‌గా ఇది అందుబాటులోకి వచ్చిందని గుర్తుచేశారు. అనంతరం ముదిరాజ్, యాదవ్, గౌడ, ఎస్సీ, ఎస్టీ సహా వివిధ సామాజిక వర్గాలకు ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. 2017లో అప్పటి హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి చేతుల మీదుగా ఫంక్షన్ హాల్ ప్రారంభమైందని తెలిపారు. ఫంక్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రధానంగా పేద విద్యార్థుల ఉన్నత చదువులకు వినియోగించాలని నూతన కమిటీకి సూచించారు. అందులో 50 శాతం రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు, మిగతా 50 శాతం ఇతర వర్గాల్లోని నిరుపేద విద్యార్థులకు కేటాయిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యలో సీట్లు సాధించినా ఫీజులు చెల్లించలేని విద్యార్థులను గుర్తించి ఆదుకోవాలని కోరారు. మేడిపల్లికి చెందిన రైతు ముక్కిస పాపిరెడ్డి ఆయిల్ పామ్ సాగు ద్వారా పొందుతున్న ఆదాయంలో ఏటా రూ.2 లక్షలను ఇద్దరు పేద విద్యార్థుల చదువుల కోసం అందిస్తానని ప్రకటించడం అభినందనీయమని హరీశ్ రావు తెలిపారు. సమాజం నుంచి పొందిన దాంట్లో కొంత తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రెడ్డి సంఘం అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి ఏటా రూ.51 వేల సాయం ప్రకటించడాన్ని కూడా అభినందించారు. సంఘాలు విజిటింగ్ కార్డులపై పదవులు ముద్రించుకోవడానికి కాదని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచినప్పుడే వాటికి సార్థకత ఉంటుందని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఇతర సమాజాల్లో కనిపించే ఐకమత్యాన్ని ఆదర్శంగా తీసుకుని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, విద్యార్థులు, వ్యాపారాల్లో నష్టపోయిన వారికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఎదుగుతున్న వారిని ప్రోత్సహించే సంస్కృతి పెరగాలని, ఒకరి అభివృద్ధిని మరొకరు అడ్డుకునే ధోరణి మంచిది కాదని పేర్కొన్నారు.

## దివ్యాంగుల యూడీఐడీ ప్రత్యేక క్యాంపు తేదీలో మార్పు

- ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శిబిరం



**చట్టం, మెదక్ ప్రతినిధి :** దివ్యాంగుల కోసం నిర్వహించనున్న యూడీఐడీ (UDID) ప్రత్యేక శిబిరం తేదీలో మార్పు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఆగస్టు 26న శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించగా, మిలాద్ ఉన్ నబి సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉండటంతో శిబిరాన్ని ఆగస్టు 25కు మార్చినట్లు పేర్కొన్నారు. మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆగస్టు 25న యూడీఐడీ ప్రత్యేక క్యాంపు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నూతన చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు ఆగస్టు 31తో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు యూడీఐడీ ధృవీకరణ పత్రం పొందని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన వారు ముందుగా మీసేవ కేంద్రంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారికి స్లాట్ బుకింగ్ అనంతరం ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక శిబిరంలో వైద్య పరీక్షలు చేపట్టనున్నట్లు వివరించారు. యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్యాంపు నిర్వహణకు సంబంధించిన సమాచారం డీఆర్డీఏ కార్యాలయం, సంబంధిత మండల ఏపీఎంల ద్వారా తెలియజేయనున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలి

- మల్కాపూర్ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్



**చట్టం, తూప్రాన్;** మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పిలుపునిచ్చారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ ను వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. భావితరాల మనుగడకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఉపసర్పంచ్ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, పాలకవర్గ సభ్యులు, జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, పిట్ల వేణు, రేఖ నాగరాజుగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, మెకిన్ ప్రెసిడెంట్ కరుణాకర్,యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గురువులను గౌరవించు, సమాజాన్ని రక్షించు



- ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి

**చట్టం ఆర్మూర్:** ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు సిబ్బందిపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ మండల కేంద్రంలో శనివారం రోజు వేల్పూరు మండల తహసిల్దార్ కి ట్రస్మా ఆధ్వర్యంలో ఒక వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి, ని ఇద్దరు విద్యార్థులు దారుణంగా హత్య చేసిన సంఘటనపై వారు తీవ్ర దిగ్భ్రాంతిని, నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా ప్రతినిధులు మాట్లాడుతూ, భావి భారత నిర్మాతలైన ఉపాధ్యాయులపై ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం సమాజంలో క్షమించరాని నేరమని అన్నారు. ఉపాధ్యాయులకు భద్రత కరువైతే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం సాధ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు పూర్తి రక్షణ కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఒక ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. "SAVE TEACHERS SAVE FUTURE", "గురువులను గౌరవించు, సమాజాన్ని రక్షించు" అనే నినాదాలతో ఉపాధ్యాయుల రక్షణకై ప్రభుత్వాలు స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నిజామాబాదు జిల్లా కన్వీనర్ రాజు గుజరాతి, డివిజన్ సెక్రటరీ మంద ప్రభాకర్, కరెస్పాండంట్లు శాతేల్లి రాము, పిల్లమారి నరేష్, శ్రీనివాస్, స్రవంతి గుజరాతి, ఉపాధ్యాయులు శ్యామ్ రాజ్, నవ్య, శిరీష్, గాయత్రి, సౌజన్య, చేతన్, వికాస్, జయశ్రీ, లాస్య ప్రియ, స్వరూప, ప్రీతి, రజిత, అనంత్ రావు, సరోజ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# న్యాయస్థానం.. న్యాయానికి ఆలయం






- అహంకారమే వివాదాలకు బీజం
- సంయమనంతోనే సమస్యలకు పరిష్కారం
- మందమర్రి కోర్టు ప్రారంభోత్సవంలో: హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక

**చట్టం రామకృష్ణాపూర్ (మందమర్రి) :** సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం నెలకొల్పడంలో న్యాయవ్యవస్థది కీలక పాత్ర అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మంచిర్యాల జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక అన్నారు. వ్యక్తిగత అహంకారం, అసహనం కారణంగా చిన్నచిన్న వివాదాలు న్యాయస్థానాల వరకు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి పరస్పరం గౌరవించుకుంటే అనేక వివాదాలకు అక్కడికక్కడే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మందమర్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జికమ్‌జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు భవనాన్ని శనివారం న్యాయమూర్తి ప్రారంభించారు. వివిధ మతాల పెద్దల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ, పోలీసు, జిల్లా యంత్రాంగం, సింగరేణి అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయస్థానం కేవలం వివాదాలకు తీర్పునిచ్చే ప్రదేశం మాత్రమే కాదని.. పౌరుల హక్కులను పరిరక్షిస్తూ సమాజంలో న్యాయం, సమానత్వం, ధర్మాన్ని స్థాపించే రాజ్యాంగబద్ధ వ్యవస్థ అని పేర్కొన్నారు. చిన్నచిన్న విషయాలను ప్రతిష్ఠకు తీసుకుని వివాదాలను పెంచుకోవడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతోపాటు సమాజంలో సామరస్యం క్షీణిస్తోందన్నారు. సమస్య ఉత్పన్నమైనప్పుడు ప్రతీకార ధోరణికి స్వస్తి పలికి చట్టబద్ధమైన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

**వాయిదాల జాప్యానికి స్వస్తి.. సత్వర న్యాయమే లక్ష్యం**

న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని న్యాయమూర్తి సూచించారు. అనవసర వాయిదాలకు తావులేకుండా విచారణ ప్రక్రియను సమర్థంగా కొనసాగిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయం ఆలస్యమైతే న్యాయంపై ప్రజల విశ్వాసం దెబ్బతినే అవకాశం ఉందని, న్యాయవ్యవస్థలోని ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని పేర్కొన్నారు. మతాలు, ధర్మగ్రంథాలు బోధించే శాంతి, సహనం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో శాంతి నెలకొన్నప్పుడే శాంతిభద్రతలు సుస్థిరంగా ఉంటాయని అన్నారు.

**చీకటిలో శ్రమించి.. దేశానికి వెలుగులు**

సింగరేణి కార్మికుల సేవలను న్యాయమూర్తి ప్రత్యేకంగా కొనియాడారు. భూమి లోతుల్లో ప్రాణాలను పణంగా పెట్టి, చీకటిలో చెమటోడ్చి బొగ్గును వెలికితీస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ సమాజానికి ఎంతో విలువైనదని అన్నారు.

**న్యాయసేవలు మరింత చేరువ..**

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లో న్యాయస్థానాల ఏర్పాటు ద్వారా ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. న్యాయస్థానాల విస్తరణతో కేసుల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో అవసరమైన న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడర్లు అందుబాటులో ఉన్నారని, న్యాయవ్యవస్థకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం నిరంతరం అందిస్తామని తెలిపారు. అంతకుముందు న్యాయమూర్తి నగేష్ భీమపాక మందమర్రిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఎ. వీరయ్య, శారదాదేవి, మంచిర్యాల జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, మందమర్రి కోర్టు ఇన్‌చార్జి జడ్జి కె. నిరోష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, న్యాయస్థానాల అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 24న రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్ విజయవంతం చేయాలి: ఏర్పుల బాలరాజ్



**చట్టం మెదక్ ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని, ప్రజలు సహకరించాలని బీఆర్టీయూ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాలరాజ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి, మూడు సంవత్సరాలకు సంబంధించిన రూ.36 వేల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' పేరుతో తీసుకురావాలని భావిస్తున్న ఈఆటోల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. వెంటనే ప్రమాద బీమా మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచాలని ఏర్పుల బాలరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24న నిర్వహించే రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

## హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

- హైకోర్టు సీనియర్ న్యాయవాది మోయిన్ అహ్మద్ ఖాద్రి



**చట్టం, లింగంపేట్:** లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది మోయిన్ అహ్మద్ ఖాద్రి రూ.లక్ష విరాళం ప్రకటించినట్లు హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మోయిన్ అహ్మద్ ఖాద్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారంగా రూ.లక్ష అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు మోయిన్ అహ్మద్ ఖాద్రి పేర్కొన్నారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించేందుకు ముందుకొచ్చిన ఆయనకు హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాసు చంద్రయ్య, నిజ్జన రామలింగం, తలారి సాయిబాబా, పిట్ల వెంకటి, తలారి యాదగిరి, క్యాసాల సాయిలు, జోగాయల నారా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఆవుల రాజిరెడ్డి



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి , నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ , కౌన్సిలర్లతో కలిసి ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం**

విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



**నర్సాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమం**

నర్సాపూర్‌లోని సాయి కృష్ణ గార్డెన్‌లో నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల కోసం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు పరేడ్ ప్రతీక

**పోలీసు సిబ్బంది ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**గౌరవ వందనం స్వీకరించిన డీఎస్పీ ప్రసన్న కుమార్**





**చట్టం మెదక్ ప్రతినిధి :** పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమన్వయం, సమయపాలనకు పరేడ్ ఎంతో కీలకమని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు పరేడ్‌కు ఆయన హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అవసరమన్నారు. పరేడ్‌లో పాల్గొనడం ద్వారా సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయ భావన పెంపొందుతాయని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సిబ్బంది ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా మెలుగుతూ వారి సమస్యలను తెలుసుకుని చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. అనంతరం పరేడ్‌లో పాల్గొన్న సిబ్బంది కవాతు, డ్రిల్, యూనిఫాం నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలను డీఎస్పీ పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐ లు శైలెందర్, రామకృష్ణ, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భారత సైనికుడికి ఘనంగా సన్మానం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం రోజు భారత ఆర్మీలో ఉద్యోగం సాధించి గత ఐదు సంవత్సరాలుగా అస్సాం రాష్ట్రంలో సైనికునిగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన వల్లెపు నవీన్, ను అంకాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి జి. రాజన్న, మంగళవారం బాజన్నతో పాటు కమిటీ సభ్యులు పాల్గొని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడు భారత ఆర్మీలో సేవలందిస్తూ గ్రామానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మదన్‌పల్లిలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామంలో వరలక్ష్మీ వ్రత వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామంలోని శ్రీ నీలకంఠేశ్వర శివాలయంలో శుక్రవారం రోజున మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ అర్చన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, మంగళద్రవ్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ, కుటుంబాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో శివాలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విల్లిసిల్లింది.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి

▶ **తూప్రాన్ ఆర్డీఓకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం**




**చట్టం, తూప్రాన్;** రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, అర్హులైన రైతులకు భూమిపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. బీజేపీ తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు భూమన్నగరి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన రైతుల భూములను జాబితా నుంచి తొలగించి, రైతులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రటరీ నత్తి మల్లేశ్ ముత్తురాజు గారు మాట్లాడుతూ, 22ఏ నిషేధిత జాబితా కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రైతులు తమ భూములకు సంబంధించిన హక్కులను అనుభవించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హత కలిగిన రైతుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి, వారికి పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీజేపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా 22ఏ నిబంధనల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల అధ్యక్షులు పిట్ల పోషయ్య, తూప్రాన్ జనరల్ సెక్రటరీ సంపత్ గౌడ్, రాజు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం 22ఏ నిషేధిత జాబితా సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.

## అంబులెన్స్ పేరుతో రోడ్డుపై సైరన్ల హంగామా

▶ **రోగి లేకున్నా సైరన్ వేసుకుంటూ వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్!**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడాల్సిన అంబులెన్స్ వాహనాలు, రోడ్డుపై వెళ్లే వాహనదారులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై బుధవారం ఒక ప్రైవేట్ అంబులెన్స్ వాహనం సైరన్ వేసుకుంటూ అత్యంత వేగంగా వెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. అత్యవసర పరిస్థితి ఉందేమోనని భావించి మిగతా వాహనదారులు, బాటసారులు పక్కకు తప్పుకొని దారి ఇచ్చారు. అయితే సదరు అంబులెన్స్‌లో పరిశీలించగా ఎలాంటి రోగి (పేషెంట్) లేకపోవడం గమనార్హం.

**రోగి లేకున్నా సైరన్ మోగించడం నేరం**

ట్రాఫిక్ నిబంధనల ప్రకారం అంబులెన్స్‌లో అత్యవసర పరిస్థితి లేదా రోగి ఉన్నప్పుడు మాత్రమే సైరన్ వినియోగించి, ప్రైవేలేజ్ హక్కు పొందాలి. ఎలాంటి పేషెంట్ లేనప్పుడు, సైరన్ వేసుకుంటూ వెళ్లడం నిబంధనలకు విరుద్ధం.

**మోటారు వాహనాల చట్టం (ఎం వి ఏ) సెక్షన్లు:**

ఇలాంటి ఉల్లంఘనలపై మోటారు వాహనాల చట్టం ప్రకారం క్రింది చర్యలు తీసుకునే అవకాశముంది:

సెక్షన్ 177 (సాధారణ ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన): రహదారి నిబంధనలు పాటించకుండా ఇతరులకు ఆటంకం కలిగించినందుకు జరిమానా. సెక్షన్ 184 (ప్రమాదకరంగా వాహనం నడపడం): రోగి లేకున్నా అత్యవసర నెపంతో వేగంగా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినందుకు ప్రాథమిక చర్యలు.

సెక్షన్ 190 (అధిక శబ్దం / సైరన్ దుర్వినియోగం): అనుమతి లేకుండా లేదా అనవసరంగా సైరన్ ఉపయోగించి ధ్వని కాలుష్యానికి, అయోమయానికి గురిచేసినందుకు ఫైన్.

బాధ్యతారాహిత్యంగా సైరన్లను దుర్వినియోగం చేసే ఇలాంటి ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లపై సంబంధిత ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేస్తున్నారు.

## ఓబీసీ మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం




**చట్టం/పరకాల;** భారతీయ జనతా పార్టీ పరకాల అర్బన్ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ నియమించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా పైండ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శిగా గుడిగంటి రఘుపతి గౌడ్ ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు గాజుల నిరంజన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఓబీసీ మోర్చా అభివృద్ధికి నూతన నాయకులు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



**చట్టం/పరకాల:** మెగాస్టార్ చిరంజీవి 71వ పుట్టినరోజు వేడుకలను పరకాల పట్టణంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో చిరంజీవి అభిమాని బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మడికొండ శ్రీను మాట్లాడుతూ.. చిరంజీవి తన నటనతో యువతతో పాటు కోట్లాది మంది ప్రేక్షకులకు అభిమాన నటుడిగా నిలిచారని అన్నారు. సమాజ సేవలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ప్రాణదానం చేస్తున్నారని కొనియాడారు. చిరంజీవి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొచ్చు భాస్కర్, బొచ్చు రవికుమార్, బొచ్చు జాన్సన్, బొచ్చు మహేష్, ఒడ్డెపెల్లి ప్రభు, ధర్మారం తిరుపతి, కందుకూరి వెంకట్, దొమ్మటి శ్రీను, ఒంటెరు నాగరాజు, బొచ్చు దేవయ్య, అరికిళ్ల దశరతం, మేకల దిలీప్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**చట్టం/పరకాల;** పరకాల పట్టణంలోని రాజుపేటలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ అయూబ్ తో కలిసి పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తే పరకాల ప్రాంతంలోని విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నాణ్యత విషయంలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమే కాదు.. వాటిని పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా మేమే చేస్తాం" అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం

▶ **అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**





**చట్టం/పరకాల;** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల టౌన్‌తో పాటు పరకాల, నడికూడ, ఆత్మకూర్, దామెర మండలాల పరిధిలోని అర్హులైన పేద కుటుంబాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరకాల నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ప్రజాసేవ చేసే అవకాశం లభించిందని, తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 88,384 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి నెల 1,832.06 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. నూతన రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా 18,365 మంది కొత్త లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేందుకు ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హతను బట్టి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైళ్లకు అదనపు బోగీలపై కదలిక

▶ **పండుగల రద్దీ దృష్ట్యా కోచ్‌ల పునరుద్ధరణకు హామీ**

▶ **పీసీఎంఈకి డీఆర్‌యూసీసీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ వినతి**



**చట్టం, రామకృష్ణాపూర్:** పండుగల వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఇంటర్‌సిటీ, రామగిరి, బల్లార్షా-కాజీపేట రైళ్లలో కోచ్‌ల సంఖ్య పెంచేందుకు దక్షిణ మధ్య రైల్వే సానుకూలంగా స్పందించింది. గతంలో తొలగించిన కోచ్‌లను పునరుద్ధరించడంతో పాటు అవసరాన్ని బట్టి అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ డీఆర్‌యూసీసీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ శనివారం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ) బి.వి. జయ్‌కుమార్ రత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్ నిలయంలో పీసీఎంఈతో సమావేశమైన శ్రీనివాస్ ఆయా రైళ్లలో ప్రయాణికుల రద్దీ, కోచ్‌ల కొరతతో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. గతంలో అందుబాటులో ఉన్న కోచ్‌లలో కొన్నింటిని తొలగించడంతో ప్రయాణికులపై భారం పెరిగిందన్నారు. ముఖ్యంగా రాఖీ, దసరా, దీపావళి వంటి పండుగల సందర్భంగా ఉత్తర తెలంగాణ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు పెరిగే అవకాశం ఉన్నందున రద్దీకి అనుగుణంగా ముందస్తు రైల్వే నిర్వహణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుత కోచ్‌ల సామర్థ్యం ప్రయాణికుల డిమాండ్‌కు సరిపోవడం లేదని, రిజర్వేషన్ సౌకర్యం లభించకపోవడంతో పలువురు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికుల డిమాండ్, రైళ్ల ఆక్యుపెన్సీ, రద్దీని పరిగణనలోకి తీసుకుని అదనపు కోచ్‌లను జతచేయడం లేదా గతంలో తొలగించిన కోచ్‌లను తిరిగి పునరుద్ధరించడం ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు.


**రద్దీని బట్టి చర్యలకు హామీ...**

వినతిపత్రంపై పీసీఎంఈ బి.వి. జయ్‌కుమార్ రత్ సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికుల అవసరాలు, రద్దీ పరిస్థితులను పరిశీలించి అదనపు కోచ్‌ల ఏర్పాటు, తొలగించిన కోచ్‌ల పునరుద్ధరణపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయా రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు కొంత ఊరట లభించే అవకాశం ఉందన్నారు.

**ఎంపీ చొరవతో ఉన్నతాధికారుల దృష్టికి...**

కోచ్‌ల పెంపు అంశాన్ని ఇప్పటికే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లినట్లు శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికుల సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాశారని చెప్పారు. ప్రయాణికుల ఇబ్బందుల పరిష్కారానికి చొరవ చూపిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. పీసీఎంఈ బి.వి. జయ్‌కుమార్ రత్‌ను శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాము నాయక్, బెల్లంపల్లి శివప్రసాద్, వేముల నరేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మన లక్ష్యం



▶ **: ఎమ్మెల్యే జారే**

**చట్టం అశ్వారావుపేట :** కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ, ఇన్చార్జ్ లు, కోఆర్డినేటర్లకు జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోటదేవి ప్రసన్న, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో గత నెల రోజులుగా ప్రతి బూత్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన బిఎల్ఏల సేవలను అభినందించారు. యిదే క్రమంలో ఎస్ఐఆర్ మొదటి విడత అనంతరం ఫేజ్ 2లో పూర్తి చేయాల్సిన ఫారమ్‌లు, పాటించాల్సిన నిబంధనలపై బిఎల్ఏలు, కోఆర్డినేటర్స్, సూపర్‌వైజర్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, అవగాహనతో పని చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన నిజమైన ఓటర్ల ఓటు హక్కు రక్షణకు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని, కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన ఓటర్లను గుర్తించి వారి ఓటును కాపాడాల్సిన పూర్తి బాధ్యత బిఎల్ఏలపై ఉదని దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పేదవారికి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చూస్తూ వారిని కాంగ్రెస్ పార్టీతో అనుసంధానమై ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని డీసీసీ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ వీరభద్రం, బిఎల్ఏలు, ఇంచార్జిలు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆశ్రమ పాఠశాలకు మహిళా వార్డెన్‌ను వెంటనే నియమించాలి

▶ **డిటిడిఓకు ఎస్ఎఫ్ఐ వినతిపత్రం**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి:** నిర్మల్ జిల్లా స్వర్ణ ఆశ్రమ బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, హాస్టల్‌కు పూర్తిస్థాయి మహిళా వార్డెన్‌ను వెంటనే నియమించాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నిర్మల్ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిటిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దిగంబర్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం హాస్టల్‌లో పురుష వార్డెన్ బాధ్యతలు నిర్వహిస్తుండటంతో విద్యార్థినులు తమ వ్యక్తిగత, ఆరోగ్య సంబంధిత సమస్యలను తెలియజేయడానికి సంకోచిస్తున్నారని పేర్కొన్నారు. బాలికల హాస్టల్‌లో మహిళా వార్డెన్ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాస్టల్‌లో కనీస మౌలిక వసతులు సరిగా లేక విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. బాత్రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండటం, శౌచాలయాల కొరత, తాగునీటి సమస్యలతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్వర్ణ ఆశ్రమ పాఠశాలకు తక్షణమే మహిళా వార్డెన్‌ను నియమించాలని, అపరిశుభ్రంగా ఉన్న బాత్రూమ్‌లకు మరమ్మతులు చేపట్టాలని, అదనపు శౌచాలయాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యార్థినులకు సరిపడా తాగునీరు, విద్యుత్, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరింది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థినుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని దిగంబర్ హెచ్చరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ నితిన్ పాల్గొన్నారు.

## బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ఎంపిక




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని విజయ్ హై స్కూల్ క్రీడా మైదానంలో శనివారం రోజు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు గడ్డం శ్రావణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్యామ్ ఆధ్వర్యంలో జిల్లా బాల్ బ్యాట్మెంటన్ బాల, బాలికల క్రీడాకారుల క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లాల నుండి 130 క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం శ్రావణ్ రెడ్డి, విశిష్ట అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ కవిత దివాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 28వ తేదీ నుండి 30 వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా బిహెచ్ఈఎల్ శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల గ్రౌండ్స్ లో జరిగే 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారనీ టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు తెలిపారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా జిల్లా సంఘం కృషి చేస్తుందని రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పథకాలు సాధిస్తుందని, ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి తుది జట్టును ఎంపిక చేయడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సునీత, కామారెడ్డి కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేష్, సంఘ సభ్యులు సురేష్, సీనియర్ క్రీడాకారులు ఆనంద్, కార్తీక్, సాయికుమార్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామల, మహేష్, యు మహేష్, శివ మహేష్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లు అప్పగింత




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులు ఐదు మందికి 01.ఉమ్మేడ లక్ష్మి, 02.నాగుల నిరంజన్, 03.కాందు తుకారం సేలి, 04.పిట్ల నరేష్, 05.ఆలకుంట సుజాత, లకు మొబైల్ ఫోన్ లను అప్పగించబడినదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా మూడు సంవత్సర క్రితం రెండు మొబైల్స్, ఒక సంవత్సరం లోపు మూడు మొబైల్స్ లు ఇచ్చినట్లు తెలిపారు.

## మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే పలు సమస్యలపై వినతి పత్రం అందజేత




**చట్టం ఆర్మూర్:** నిజామాబాదు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగడం లేదని, అలాగే డబ్బులు కూడా రావడంలేదని, నూతనంగా ఏర్పడిన మండలాలలో తహశీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఆర్మూర్ లో రెవెన్యూ, తహశీల్దార్ కార్యాలయాలు ఒకే దగ్గర ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

## క్రమశిక్షణ, ఫిట్‌నెస్ పోలీస్ శాఖకు మూలాధారం

▶ **వీక్లీ పరేడ్‌తో పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం**

▶ **ఆరోగ్య పరిరక్షణతోనే సమర్థవంతమైన విధినిర్వహణ**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ సబ్‌డివిజన్లు, సర్కిల్ పరిధుల్లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది బేస్‌లైన్ ఫాలిన్‌లో పాల్గొని, అనంతరం పరేడ్, డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మల్ సబ్‌డివిజన్ పరిధిలోని నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్, నిర్మల్ రూరల్ సర్కిల్, సోన్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ పరేడ్‌ను పర్యవేక్షించారు. సీఐ కృష్ణ, సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్ పరేడ్‌ను పరిశీలించి, సిబ్బంది ప్రదర్శించిన డ్రిల్‌ను పర్యవేక్షించారు. సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని సిబ్బందికి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ పరేడ్‌ను పర్యవేక్షించగా, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వీక్లీ పరేడ్ ద్వారా పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సమన్వయం పెరుగుతాయని తెలిపారు. విధినిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు శారీరక, మానసిక ఆరోగ్యం అవసరమని సూచించారు. విధుల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయడం, ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, ఆరోగ్య, విధులకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. ఈ వీక్లీ పరేడ్‌లో ఏఆర్, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, ఎస్‌బీ, పీసీఆర్, షీ టీమ్, భరోసా తదితర విభాగాలకు చెందిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులను రెచ్చగొట్టి బీఆర్ఎస్ రాజకీయ పబ్బం

- పాలిటెక్నిక్ ఆందోళనల వెనుక రాజకీయ కుట్ర: కేటీఆర్ వైఖరిపై కాంగ్రెస్ ఫైర్
- మంత్రి వివేక్ మాటలను వక్రీకరించి దుష్ప్రచారం: విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా...?
- జీవో 97పై తప్పుడు ప్రచారం ఆపాలి.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి: వోడ్నాల శ్రీనివాస్



**చట్టం, రామకృష్ణాపూర్:** పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయ మంటలు రాజేస్తోందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుంటే.. బీఆర్ఎస్ మాత్రం విద్యార్థులను రెచ్చగొట్టి రోడ్డెక్కించే రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే కేటీఆర్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా...? అని నిలదీశారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలను తెలుసుకుని పరిష్కరించేందుకు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్వయంగా మాసబ్‌ట్యాంక్‌లోని పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లారని తెలిపారు. నిరసనలో ఉన్న విద్యార్థుల మధ్యకే వెళ్లి వారి అభ్యంతరాలను విని, ప్రభుత్వం తరపున సానుకూలంగా స్పందించారని చెప్పారు. అయితే ఈ పరిణామాన్ని కూడా రాజకీయంగా వాడుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు.

**విద్యార్థుల భవిష్యత్తా..**
**బీఆర్ఎస్ రాజకీయ ప్రయోగశాలా...?**

"విద్యార్థులకు ఏదైనా సందేహం ఉంటే ప్రభుత్వం వద్దకు తీసుకురావాలి. పరిష్కారం కోసం చర్చించాలి. కానీ విద్యార్థులను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకువచ్చి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం ఏ రకమైన బాధ్యత..?" అని అయన ప్రశ్నించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసే క్రమంలో మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి వాస్తవాలను ప్రజల ముందుంచకుండా కొన్ని మాటలను మాత్రమే ఎంచుకుని తప్పుడు అర్థాలు వచ్చేలా ప్రచారం చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

**జీవో 97పై ఎందుకీ భయప్రచారం...?**

పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను విద్యార్థుల భవిష్యత్తుకు ముప్పుగా చిత్రీకరించడం సరికాదన్నారు. పరిశ్రమలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలు, రోబోటిక్స్, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిప్లొమా అనంతరం ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో చేరే అవకాశంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. "విద్యార్థులకు అవకాశాలు పెంచే జీవోను కూడా భయపెట్టే ఆయుధంగా మార్చడం బీఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**గ్లోబరీనా.. గ్రూప్-1.. ఇవన్నీ మరిచారా...?**

విద్యార్థుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు ఉందా...? అని ఆయన ప్రశ్నించారు. ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థకు సంబంధించిన వివాదం, విద్యార్థుల ప్రాణనష్టం, గ్రూప్1 పరీక్ష రద్దు వంటి ఘటనలను కేటీఆర్ మరిచిపోయారా అని నిలదీశారు. "మీ పాలనలో విద్యార్థులు ఎదుర్కొన్న కష్టాలకు సమాధానం చెప్పకుండా.. ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తుపై మొసలి కన్నీరు కార్చడం ప్రజలను మోసం చేయడమే" అని విమర్శించారు. ప్రభుత్వంపై విమర్శించడానికి బలమైన అంశాలు లేకపోవడంతోనే పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యను పట్టుకుని బీఆర్ఎస్ కొత్త రాజకీయ నాటకానికి తెరతీసిందని ఆరోపించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం దిశ.. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతోందని అయన తెలిపారు. గురుకులాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. "విద్యార్థులను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. వారి భవిష్యత్తుతో ఆటలాడితే ప్రజలు క్షమించరు. బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే రాజకీయాలు మానుకుని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. లేకపోతే విద్యార్థులే మీ రాజకీయాలకు సమాధానం చెబుతారు" అని వోడ్నాల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు చేయూత జీవన భృతి ఇవ్వాలి

- లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం: వనమాల కృష్ణ



**చట్టం, బీబీపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేయూత పథకంలో బీడీ కార్మికులందరికీ జీవన భృతి కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద మహాధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి. రాజేశ్వర్ అధ్యక్షతన జరిగిన సభలో వనమాల కృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివరి నాటికి చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అప్లికేషన్ మోడల్ విడుదల చేసిందన్నారు. ఇందులో చేనేత కార్మికులు, గీత కార్మికులకు అవకాశం కల్పించినప్పటికీ బీడీ కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. బీడీ కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. తక్షణమే బీడీ కార్మికులకు చేయూత పథకంలో జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్ మాట్లాడుతూ, బీడీ కార్మికులకు పని దినాలు తగ్గిపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. గతంలో యూనియన్ పోరాటాల ద్వారా సాధించుకున్న జీవన భృతి కార్మికుల కుటుంబాలకు కొంత ఊరటనిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవన భృతి అందకుండా చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీడీలు చుట్టే కార్మికులు, బీడీ ప్యాకర్లు, నెలసరి జీతాల ఉద్యోగులు, బీడీ కమిషన్ ఏజెంట్లకు చేయూత పథకంలో జీవన భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు బి. మల్లేష్, డి. కిషన్, జిల్లా నాయకులు సాయరెడ్డి, లింగం లక్ష్మి, వసంత, అంజమ్మ, ప్రజాసంఘాల నాయకులు గణేష్, సాయిబాబా, అమూల్య, నాగమణి, సృజన్ శ్రీశాంత్ తదితరులు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు గంగాధర్, రమేష్, చరణ్ తమ పాటలతో బీడీ కార్మికులను చైతన్యపరిచారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

## నిర్మల్ రైస్ మిల్లులపై విజిలెన్స్ కొరడా..

- కోట్ల విలువైన సీఎంఆర్ అక్రమాలపై కేసులు, రైస్ మిల్లులపై వరుసగా ఎన్ఫోర్స్‌మెంట్ తనిఖీలు
- ఖానాపూర్, భైంసా, లోకేశ్వరం ప్రాంతాల్లో సోదాలు,ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసాలు గుర్తించిన అధికారులు
- సివిల్ సప్లైస్ ఎన్ఫోర్స్‌మెంట్‌కు 28 మంది కమాండోలు,రికార్డులు ఒకలా.. స్టాక్ మరోలా ఉంటే కఠిన చర్యలు



**చట్టం నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లాలో రైస్ మిల్లులపై ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఖానాపూర్, భైంసా, లోకేశ్వరం, సారంగాపూర్, మామడ మండలాల్లోని పలు రైస్ మిల్లుల్లో అధికారులు రికార్డులు, ధాన్యం నిల్వలు, సీఎంఆర్ బియ్యం వివరాలను పరిశీలిస్తున్నారు. తనిఖీల్లో ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యం, బియ్యం నిల్వలకు సంబంధించిన వ్యత్యాసాలు బయటపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఖానాపూర్ ప్రాంతంలోని మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్‌కు సంబంధించిన రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.49 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం విషయంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. భైంసాలోని పలు రైస్ మిల్లుల్లోనూ విస్తృత తనిఖీలు నిర్వహించిన అధికారులు, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి పలువురు మిల్లర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

**లోకేశ్వరంలో భారీ ధాన్యం కొరత**

లోకేశ్వరం మండలం నగరం ప్రాంతంలోని కేఎస్ఆర్ రైస్ మిల్లును తనిఖీ చేసిన అధికారులకు 5,385.246 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీని విలువ సుమారు రూ.12 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అదే ప్రాంతంలోని లక్ష్మీ నరసింహ రైస్ మిల్లులో సుమారు 5,746 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీని విలువ దాదాపు రూ.13 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ వ్యవహారాలకు సంబంధించి పి. శ్రీనివాస్, కె. మాలతిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వర్గాలు తెలిపాయి.

**ముధోల్, బాసర ప్రాంతాలపైనా దృష్టి**

నిర్మల్ జిల్లాలో కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా ముధోల్, బాసర మండలాల్లోని రైస్ మిల్లుల్లోనూ త్వరలో రాష్ట్రస్థాయి ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో మరిన్ని మిల్లుల రికార్డులు, నిల్వలను పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం మిల్లింగ్ చేసి సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి అందించారా? ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిందా? రికార్డుల్లో చూపిన నిల్వలకు క్షేత్రస్థాయిలో ఉన్న స్టాక్‌కు సరిపోలిక ఉందా? అనే అంశాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు.

**రైస్ మిల్లులపై కమాండోల నిఘా**

రైస్ మిల్లుల్లో అక్రమాలను అరికట్టేందుకు తెలంగాణ సివిల్ సప్లైస్ ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగానికి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 28 మంది కమాండోలను ప్రభుత్వం కేటాయించింది. హైదరాబాద్‌లోని సివిల్ సప్లైస్ భవన్‌లో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో కొత్తగా విధుల్లో చేరిన కమాండోలకు బాధ్యతలపై దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఇకపై బియ్యం బకాయిల విషయంలో కేవలం నోటీసులు, సాధారణ తనిఖీలకే పరిమితం కాకుండా ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల తనిఖీ, అవసరమైతే చట్టపరమైన చర్యలు చేపట్టేలా ఎన్ఫోర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**రూ.40 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు**

గత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 154 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు సమాచారం. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిన నేపథ్యంలో మిల్లింగ్ అనంతరం ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం, పెండింగ్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇప్పటికే స్పష్టం చేసిన నేపథ్యంలో తనిఖీలు మరింత కఠినతరం కానున్నాయి. మిల్లుల్లో వాస్తవంగా ఎంత ధాన్యం, బియ్యం ఉంది? ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యంలో ఎంత మేర బకాయి ఉంది? రికార్డులకు స్టాక్‌కు మధ్య వ్యత్యాసం ఉందా? ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించారా? అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం, బకాయిల విషయంలో అక్రమాలు నిర్ధారణ అయితే కేసుల నమోదుతో పాటు నష్టపోయిన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసే దిశగా చర్యలు కొనసాగుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నిర్మల్ జిల్లాలో రైస్ మిల్లులపై కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు మిల్లర్లలో తీవ్ర చర్చకు దారితీశాయి.

## సీటు మీది.. ఫీజు నాది: హరీష్ రావు




- ప్రభుత్వ కళాశాలలో సీటు సాధిస్తే చదివించే బాధ్యత నాదే
- తల్లిదండ్రుల కలలను నిజం చేసేలా విద్యార్థులు ఎదగాలి
- ప్రభుత్వ పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో చదవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మెడికల్ లేదా ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించిన పేద విద్యార్థుల చదువుకు అవసరమైన ఫీజు భరించే బాధ్యత తనదని ప్రకటించారు. నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన "మీ భవిష్యత్.. మీ బాధ్యత" కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని కలలు కంటారని తెలిపారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులుగా ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. విద్యార్థులు సాధించిన విజయమే వారి తల్లిదండ్రులకు నిజమైన గర్వకారణమని పేర్కొన్నారు. "ప్రపంచంలో కల్తీ లేని ప్రేమ అమ్మ ప్రేమ. పిల్లలు ఆకలితో ఉండకూడదని, ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు నిరంతరం తపిస్తుంటారు. వారి తపనను నిజం చేసే బాధ్యత విద్యార్థులపై ఉంది" అని అన్నారు. తల్లిదండ్రులు లేని లేదా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కష్టపడి చదివి ప్రభుత్వ మెడికల్ కళాశాల లేదా ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించాలని ప్రోత్సహించారు. "సీటు మీది.. ఫీజు నాది" అంటూ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సిద్దిపేట పట్టణంలోని ఒక దర్జీ కుటుంబానికి చెందిన నలుగురు అమ్మాయిలు మెడిసిన్‌లో సీట్లు సాధించారని, అలాగే ఆర్థికంగా వెనుకబడిన హోటల్ నిర్వహించే కుటుంబానికి చెందిన విద్యార్థి కూడా మెడిసిన్ సీటు సాధించారని ఉదాహరణగా చెప్పారు. అలాంటి పేద విద్యార్థుల చదువుకు తాను సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీష్ రావు విమర్శించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాల పంపిణీ వంటి అంశాల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## యాదవుల అభ్యున్నతికి ఐక్యతతో ముందుకు సాగాలి




- అఖిల భారత యాదవ మహాసభ పట్టణ నూతన కార్యవర్గానికి అభినందనలు

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** యాదవ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సుకు నిరంతరం కృషి చేయాలని సూచించిన ఆయన, యాదవ సమాజానికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట పట్టణ నూతన కార్యవర్గ సభ్యులు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో హరీశ్ రావును కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు గంధం రాజు యాదవ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను హరీశ్ రావు అభినందించి సత్కరించారు. యాదవులు ఐకమత్యంతో ఉంటూ సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో అభివృద్ధి సాధించేలా సంఘం కృషి చేయాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతూ యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగుల ఎల్లం యాదవ్, శ్రీశైలం యాదవ్, బత్తిరాజు హరికృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజబోయిన రమేష్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఎలుక పోచయ్య యాదవ్, సహాయ కార్యదర్శి రాజవేణి బాలయ్య యాదవ్, తెలిజిరు ఐలయ్య యాదవ్, ప్రచార కార్యదర్శి కుక్కల తిరుపతి యాదవ్, కార్యవర్గ సభ్యులు రాగరం శ్రీనివాస్ యాదవ్, రాగం సాయి యాదవ్, పుల్లూరి కుంటయ్య యాదవ్, కుంచం కనకయ్య యాదవ్ పాల్గొన్నారు. సంఘం ముఖ్య నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్, మామిండ్ల ఐలయ్య యాదవ్, గొర్రె మల్లిఖార్జున్ యాదవ్, బొల్లు రాము యాదవ్, పెరబోయిన శ్రీకాంత్ యాదవ్, బాగు యాదగిరి యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఫార్మసీ కౌన్సిల్ సభ్యునిగా చిలువేరి మారుతి నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడుగా రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చిలువేరి మారుతిని నామినేట్ చేయడం జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురికి అవకాశం కల్పించగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చిలువేరి మారుతికి అవకాశం రావడం అభినందనీయమన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంత్రి సమీక్ష



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం రెవెన్యూ అంశాలపై, గృహ నిర్మాణ కార్యక్రమాల ప్రగతిపై నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ సంస్థ ఎం.డీ గౌతమ్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఆశిష్ సాంగ్వాన్, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

## పేదింటి వరం ఇందిరమ్మ ఇల్లు – బాసరలో గృహప్రవేశం



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని రవీంద్రపూర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేజర్ గ్రామపంచాయతీ బాసరకు ప్రభుత్వం వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు సంబంధిత మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్రపూర్ కాలనీకి చెందిన డొప్పోళ్ల నాగమణి-సాయినాథ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్, సంజీవ్ రావ్ దేశ్‌ముఖ్, మమ్మాయి మహేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్, వార్డు సభ్యుడు నానం సాయిలు, చేవిటోళ్ల సాయినాథ్, తన్వీర్ మహేందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులు కార్యక్రమానికి హాజరైన పలువురిని శాలువాలతో సన్మానించారు.

## ఆర్జీయూకేటీ బాసరలో జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం బాసర ట్రిబుల్ ఐటీని సైకాలజికల్ వెల్‌నెస్ సెంటర్, జిల్లా డబ్ల్యూసిడి ఎస్సీ డిపార్ట్‌మెంట్ సంయుక్త నిర్వహణలో పీయూసీ1 బ్యాచ్1 విద్యార్థుల కోసం "జీవన నైపుణ్యాలు స్వీయ అవగాహన మానసిక ఆరోగ్యం న్యాయ అవగాహన" కార్యక్రమం 2026 ఆగస్టు 22న స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (SAC) లో మధ్యాహ్నం 1:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అత్యంత స్ఫూర్తిదాయకంగా జరిగింది. వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఈ మురళీ దర్శన్, డీన్ డా.ఎస్. విట్టల్ నిరంతర మార్గదర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమంలో మైండ్‌ఫుల్‌నెస్ అంశంపై డాక్టర్ అల్లాడి సురేష్, న్యాయపరమైన అంశాలపై నివేదిత, శ్వేత, జీవన నైపుణ్యాలు, బాల్యవివాహాల నివారణపై కే. శ్రీ సవిత, జెండర్ సెన్సిటైజేషన్, లింగ సమానత్వంపై ఏ మౌనిక, సాధారణ అవగాహనపై కే జ్యోతి విద్యార్థులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసి వారి సందేహాలను నివృత్తి చేశారు. నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, మానసిక దృఢత్వం, బాధ్యతాయుత నిర్ణయాలు, చట్టబద్ధమైన హక్కులు, సామాజిక బాధ్యతల ప్రాధాన్యాన్ని చాటిచెప్పిన ఈ సదస్సులో 700 మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని నేర్చుకోండి ఆలోచించండి ఎదగండి సాధికారత పొందండి. అనే ఉత్తేజిత సందేశాన్ని అందిపుచ్చుకోగా, స్టూడెంట్ వెల్ఫేర్, వెల్నెస్ సెంటర్ ప్రతినిధులు టి.ప్రకాశ్, జి.నాగరాజుతో పాటు , నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, శ్రీనివాసులు అరుంధతి, దిలీప్ కుమార్, వెంకట్ మొదలైన కౌన్సెలర్ల బృందం సమర్థవంతమైన సేవలు అందించింది, కాగా ఇదే తరహా అవగాహన సదస్సును 2026 ఆగస్టు 29న పీయూసీ1 బ్యాచ్2 విద్యార్థుల కోసం పునరావృతం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మట్టిలో మాణిక్యం... మిద్దె వినీత్

- తాతకు తగ్గ మనవడిగా పేరు తెచ్చుకున్న యువ కళాకారుడు
- ఒగ్గు కథతో తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన వినీత్
- వేములవాడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజు-మాధవి



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** తెలంగాణ జానపద కళారూపమైన ఒగ్గు కథకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖ కళాకారుడు కీ.శే. మిద్దె రాములు వారసత్వాన్ని ఆయన మనవడు మిద్దె వినీత్ కొనసాగిస్తూ తాతకు తగ్గ మనవడిగా పేరు తెచ్చుకుంటున్నాడని వేములవాడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజుమాధవి పేర్కొన్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతం నుంచి ఒగ్గు కథ ప్రదర్శనలు ప్రారంభించిన మిద్దె రాములు దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి తెలంగాణ సంస్కృతి, జానపద కళలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. అదే బాటలో మిద్దె వినీత్ అమెరికాలో జరిగిన సిలికాన్ ఆంధ్ర ఓక్లాండ్ మహాసభ వేదికపై ఒగ్గు కథ ప్రదర్శించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం గర్వకారణమన్నారు. అమెరికా పర్యటన అనంతరం స్వగ్రామం వేములవాడకు వచ్చిన సందర్భంగా మిద్దె రాములు తనయుడు మిద్దె పరుశరాములు, మనవడు మిద్దె వినీత్‌లను వేములవాడ బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు నాయకత్వంలో శనివారం శాలువాలతో సత్కరించి, మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మిద్దె వినీత్ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరిన్ని ప్రదర్శనలు నిర్వహిస్తూ తెలంగాణ జానపద కళలను విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. వినీత్‌కు రాజరాజేశ్వర స్వామి, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మిశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, అంజాద్ పాషా, సిరిగిరి చందు, మంత సందీప్, క్రాంతి కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు మద్దతు పలికిన ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శనివారం రోజు రైతన్నలు చేపట్టిన ఆందోళనకు ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ మద్దతు తెలిపారు. యూరియా యాప్ వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్మూర్ ప్రాంత రైతాంగం చైతన్యవంతులని ఆయన చెప్పుకొచ్చారు. యూరియా లేకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాతలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి మూడు యూరియా సంచులు ఇవ్వాలని ప్రభుత్వాలను, నాయకులను కోరారు. అన్నదాతల పట్ల నిర్లక్ష్యం సరికాదన్నారు. యూరియా విషయంలో ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా రైతన్నల ఆవేదనను ప్రభుత్వాలు అర్థం చేసుకొని సరిపడా యూరియా అందించాలన్నారు. రైతులు పండించే పంటలను కాపాడాలన్నారు. రైతులకు 100 శాతం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తాము ఎప్పుడు మద్దతుగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, రామ్ చందర్, నూకల శేఖర్, శ్రావణ్, కర్తన్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.


Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com